

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త


## వెంగమాంబ హుండి లెక్కింపు



**దుత్తలూరు జూన్ 24 ప్రభాతవార్త** మండలంలోని నర్రవాడ గ్రామంలో వెలసియున్న శ్రీ వెంగమాంబ పేరంటాల అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు జులై 5 నుండి 9 వరకు జరగనున్న దృష్ట్యా బుధవారం ఆలయంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన హుండిలను లెక్కించారు. ఆలయ వ్యవస్దాపక ధర్మకర్తలు ,దేవాదాయశాఖాధికారుల సమక్షంలో లెక్కింపు చేపట్టారు. గత మూడు నెలల కాలంలో భక్తులు అమ్మవారికి సమర్పించిన నగదు కానుకలను లెక్కించగా 12,48,260 రాబడి వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఆళ్ళ శ్రీనివాసరెడ్డి తెలిపారు.నగదును స్దానిక బ్యాంకులో జమ చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ప్రధాన వ్యవస్దాపక ధర్మకర్త వేమూరి ముసలయ్య, ధర్మకర్తలు ఆలయ సిబ్బంది,విశ్రాంతి బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## కండలేరులో 33.550 టీయంసీల నీటిమట్టం



**రాపూరు, జూన్ 24 ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జళాశయంలో బుధవారం ఉదయానికి 33.550 టీయంసీల నీటిమట్టం నమోదు అయినట్లు కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.జళాశయం నుండి లో లెవల్ స్లూయిస్ ద్వారా 30 క్యూసెక్కులు, కండలేరు హెడ్ రెగ్యులేటం ద్వారా 850 క్యూసెక్కులు,హెడ్ రెగ్యులేటర్ పవర్ హౌస్ ద్వారా 1230 క్యూసెక్కుల చోప్పున మొత్తం 2110 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## వ్యవసాయ అనుబంధ రంగాలకు బ్యాంకర్లు చేయూతనివ్వాలి

- రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేయాలి - జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్ల



**నెల్లూరు, జూన్ 24, ప్రభాతవార్త - కలెక్టరేట్** వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి బ్యాంకర్లు మరింత చొరవ చూపాలని, రైతులకు విరివిగా రుణాలు అందించి వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్ల సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన జిల్లాస్థాయి బ్యాంకర్ల సమితి సమావేశానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై చేపట్టిన చర్యలను లీడ్ డిస్ట్రిక్ట్ బ్యాంక్ మేనేజర్ మణిశేఖర్ కలెక్టర్‌కు వివరించారు.

**కలెక్టర్ మాట్లాడుతూ** పశుసంవర్ధక, మత్స్య, కోళ్ల పరిశ్రమల వంటి వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించేలా బ్యాంకులు రుణాల మంజూరులో ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దరఖాస్తులను అనవసరంగా తిరస్కరించకుండా, అర్హులైన ఎక్కువ మందికి రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి బ్యాంకు ప్రతినెల కనీసం 12 మంది లబ్ధిదారులకు వ్యవసాయ అనుబంధ రంగాల్లో రుణాలు మంజూరు చేసే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా రైతుల ఖర్చులు తగ్గి, వ్యవసాయం మరింత సులభతరం అవుతుందని పేర్కొన్న కలెక్టర్, ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు, డ్రోన్‌లు తదితర పరికరాల కొనుగోలుకు బ్యాంకులు ఉదారంగా రుణాలు మంజూరు చేయాలని కోరారు. అలాగే కిసాన్ క్రెడిట్ కార్డుల జారీని వేగవంతం చేసి రైతులకు పంట రుణాలు సకాలంలో అందించాలని సూచించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకారులకు అందిస్తున్న పడవల కొనుగోలుకు కూడా రుణాలు మంజూరు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో బ్యాంకర్లు తమ వంతు సహకారం అందించాలని కోరారు. గిరిజనులు అధికంగా నివసించే గ్రామ పంచాయతీల్లో బ్యాంకింగ్ సేవలను మరింత విస్తరించేందుకు కొత్త శాఖల ఏర్పాటుపై దృష్టి సారించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం విశ్వకర్మ, పీఎంఈజీపీ, ముద్ర తదితర పథకాల కింద అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించనున్న వ్యవసాయ ఎక్స్‌పో రుణ మేళాలో అన్ని బ్యాంకులు చురుకుగా పాల్గొని, తమ బ్యాంకుల్లో అమలవుతున్న పథకాల వివరాలను రైతులకు తెలియజేసి, అవసరమైన రుణ సదుపాయాలు కల్పించేందుకు ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ మణిశేఖర్, నాబార్డ్ డీడీఎం బాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవేణి, పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్ నాయక్, మత్స్యశాఖ అధికారి చాంద్ బాషా, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

## సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి

- స్వచ్ఛ గ్రామాలు, స్వచ్ఛ పట్టణాల నిర్మాణానికి అందరూ కృషి చేయాలి - జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్ల



**నెల్లూరు, జూన్ 24, ప్రభాతవార్త - కలెక్టరేట్** సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్-2026ను క్షేత్ర స్థాయిలో సమర్ధవంతంగా అమలు చేసి స్వచ్ఛమైన గ్రామాలు, పట్టణాల నిర్మాణానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్ల అధికారులను ఆదేశించారు. బుధవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్-2026పై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవోలు, సంబంధిత శాఖల అధికారులకు నిబంధనల అమలుపై పలు సూచనలు చేశారు. ఇంటి వద్దనే తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే విధానాన్ని ప్రజల్లో అలవాటు చేయాలని, ప్రతి గ్రామం, పట్టణంలో డోర్ టు డోర్ చెత్త సేకరణను తప్పనిసరిగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజారోగ్యాన్ని కాపాడవచ్చని తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యావరణ పరిరక్షణకు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాలన్నింటినీ వినియోగంలోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్) చైర్మన్ కృష్ణయ్య మాట్లాడుతూ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిబంధనలను క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా అమలు చేయాలని అన్నారు. అధికారులు సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తూ ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని, స్వచ్ఛ గ్రామాలు, స్వచ్ఛ పట్టణాల లక్ష్య సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని, పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలని సూచించారు. అలాగే చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయడం, ప్లాస్టిక్ నిషేధ నిబంధనలను ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ చట్టం ప్రకారం జరిమానాలు విధించాలని స్పష్టం చేశారు. ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రత లక్ష్యాలు సాధ్యమవుతాయని, ప్రతి ఒక్కరూ వ్యర్థాల నిర్వహణలో తమ బాధ్యతను గుర్తించి సహకరించాలని అధికారులు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రతి ప్రభుత్వ శాఖ, స్థానిక సంస్థ, ప్రజలు భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా అధికారులు పిలుపునిచ్చారు. స్వచ్ఛతను ప్రజా ఉద్యమంగా మార్చి గ్రామాలు, పట్టణాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎస్ఇ అశోక్ కుమార్, ఏఈ జనార్దన్, వివిధ శాఖల అధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## అటవీ ప్రాంతంలో మృతదేహం కలకలం

- ఊటుకూరు వాసిగా గుర్తింపు - హత్యగా అనుమానం - నిందుల కోసం పోలీసుల బృందం







**దుత్తలూరు జూన్ 24 ప్రభాతవార్త** మండలంలోని బండకిందపల్లి అటవీ ప్రాంతంలో మృతదేహం ఉన్న సంఘటన బుధవారం కలకలం రేపింది. స్దానిక బస్తాలో మృతదేహాన్ని అటవీ అధికారులకు సమాచారం అందించారు. అటవీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో ఉదయగిరి సిఐ వెంకట్రావ్ పోలీసు అధికారులు సిబ్బందితో కలిసి సంఘటనా స్దలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. గోనె సంచలో వరిగడ్డి వేసి అందులో మృతదేహాన్ని ఉంచి అనుమానస్పదంగా మృతి చెందినట్లు గుర్తించారు. క్లూస్ టీం సంఘటనా స్దలానికి చేరుకొని పరిసరప్రాంతాల్లో ఆధారాలు సేకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తుప్రారంభించారు. శవపంచనామా ద్వారా మృతుడు వింజమూరు మండలం ఊటుకూరు కు చెందిన దేవరకొండ గోవిందులు (55) గా నిర్దారించారు. మృతదేహం పరిస్థితిని బట్టి నాలుగు నుండి 5రోజులు అయి ఉండడం వలన మృతదేహం కుళ్ళిపోయింది.దీంతో పోస్టుమార్టరం సంఘటనా స్దలంలోనే నిర్వహించారు. పోస్టుమార్టరం నివేదిక అందగానే మృతికి గల కారణాలు ఇతర కారణాలను పూర్తి స్దాయిలో దర్యాప్తులో తేలనున్నాయి. ఈకార్యక్రమంలో దత్తులూరు ఎస్ఐ పి.ఆదిలక్ష్మి,పోలీస్ సిబ్బంది పాల్గోన్నారు.

## రొట్టెల పండుగ నిర్వహణను ప్రణాళికాబద్ధంగా చేపట్టండి : కమిషనర్ వైఓ.నందన్



**నెల్లూరు కార్పోరేషన్, జూన్ 24 ప్రభాతవార్త :** రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన నెల్లూరు బారాషహీద్ దర్గా రొట్టెల పండుగ నిర్వహణను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అధికారులను కమిషనర్ వైఓ.నందన్ సూచించారు. రొట్టెల పండుగ నిర్వహణపై సమీక్షా సమావేశాన్ని కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈనెల 26నుంచి 5రోజులు పాటు పండుగ జరిగే దర్గా ప్రాంగణంలో మంచినీటి సదుపాయం, హైమాక్స్ విద్యుత్‌లైట్లు, తాత్కాలిక అంతర్గత దారుల నిర్మాణం, పారిశుద్ధ్యనిర్వహణ, బ్లీచింగ్,సున్నం, మొబైల్ టాయిలెట్లు, బయోటాయిలెట్లు, రిసెప్షన్ సెంటర్ ఏర్పాటు, సిసి కెమరాలు, పార్కింగ్ ఏర్పాట్లు పార్కింగ్ ప్రాంతాల్లో వసతులు, మైక్ అనౌన్సెమెంటు ఘాటు ప్రాంతాల్లో షవర్ల ఏర్పాటు, దుకాణాల మార్కింగ్, రూట్‌మ్యాప్‌ల ప్రదర్శన, క్యూఆర్‌కోడ్ స్కానర్ల ద్వారా మార్గం వివరాలు, బారికేడ్ల నిర్మాణం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటి కమిషనర్ చెన్నుడు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ దినేష్, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ.రహంతుజానీ, ఈఈలు శేషగిరిరావు, అనీల్‌కుమార్, సిటీ ప్లానర్ రఘురాధరావు, టిపిఆర్ఓ వాసుబాబు, మేనేజర్ రాజేశ్వరి, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్, రెవెన్యూ అధికారులు సమద్, శ్రీనివాసులు, సూపరింటెండెంట్‌లు, శానిటరీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## అజీజ్ ఆధ్వర్యంలో వక్ఫ్ బోర్డుకు వైభవం

కసుమూరులో విజయవంతంగా అన్నదానంతో పాటు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌విద్యతో పాటు ఉపాధికి ప్రోత్సాహం



**వెంకటాచలం జూన్ 24 ప్రభాతవార్త:** మండలం కసుమూరులోని శ్రీ మస్తానయ్య దర్గా ఆవరణలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో శిక్షణ పొందిన మహిళలకు వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేసిన సందర్భంగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్; సీఈఓ యాకూబ్ ఖాజీ, డైరెక్టర్లు షేక్ అక్రం, మొహమ్మద్ ఇస్మాయిల్ బేగ్, జాకీర్ అహ్మద్ తదితరులతో కలిసి కుట్టు మిషన్ల పంపిణీమొదట శ్రీ మస్తానయ్య దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు **సోమిరెడ్డి మాట్లాడుతూ** మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే కసుమూరు శ్రీ మస్తానయ్య దర్గా సర్వేపల్లి నియోజకవర్గంలో ఉండటం మా అదృష్టం రాష్ట్ర నలుమూలల నుంచే గాక పొరుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు కసుమూరుకు వస్తుంటారు ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ గా మా సోదరుడు షేక్ అబ్దుల్ అజీజ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత విశేషమైన మార్పులు తెచ్చారు భక్తులందరికీ ఉచితంగా భోజనం అందించే కార్యక్రమాన్ని అజీజ్ నాయకత్వంలో ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందిచాలా పరిశుభ్రకరమైన వాతావరణంలో భోజనం అందిస్తున్నారు అన్నదాన కార్యక్రమంతో పాటు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను కూడా కసుమూరులో అందుబాటులోకి తెచ్చారు ముస్లింలతో పాటు హిందూ మహిళలు కూడా కుట్టుశిక్షణ పొందడం శుభపరిణామం శిక్షణ పూర్తి చేసుకున్న వారందరికీ వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు ఉచితంగా అందించారు త్వరలోనే కంప్యూటర్ శిక్షణ తరగతులు కూడా ప్రారంభించబోతున్నారు రాష్ట్ర స్థాయిలోనూ వక్ఫ్ బోర్డుకు చెందిన వేల కోట్ల ఆస్తులను కాపాడే ప్రక్రియ కూడా అజీజ్ భాయ్ నాయకత్వంలో జరుగుతోందివిద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించి 250 మంది పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య ఉచితంగా అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు పీ4 కార్యక్రమంలో భాగంగా మేం అమలు చేస్తున్న కార్యక్రమాలను అజీజ్ వక్ఫ్ బోర్డు ద్వారా చేస్తున్నారు అదానీ కృష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలో మేము కృష్ణపట్నం తుపాన్ షెల్టర్ లో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాలు చేపట్టాం[illegible] కంపెనీ బ్రహ్మదేవంలో రూ.20 కోట్లతో 20 పడకల ఆస్పత్రి నిర్మించడంతో పాటు బాలికలకు నర్సింగ్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వబోతోందిమస్తానయ్య ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ **షేక్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ** వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 17 స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం మొదటి సెంటర్ ను సర్వేపల్లి నియోజకవర్గంలోని కసుమూరులో ప్రారంభించాం టైలరింగ్ తో పాటు కంప్యూటర్ శిక్షణ కూడా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం చదువుతో పాటు స్కిల్ డెవలప్మెంట్ పైనా దృష్టి పెట్టాం పేద బిడ్డలు ఉన్నత చదువులు చదివి దేశానికి సంపదగా నిలిచేలా ప్రోత్సహిస్తున్నాం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నాం దైవసన్నిధిలో అన్నదాన కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు సహకరిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో పాటు పెద్దలందరికీ ధన్యవాదములు రొట్టెల పండగ పూర్తయిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ప్రారంభం కాబోతున్నాయి మాకు అన్ని విధాల సంపూర్ణ సహకారం అందిస్తున్న సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్ బాబు, ఎన్ఎండీ ఫరూక్ తదితరులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు

## సోషల్ మీడియాలో దుష్ప్రచారంపై ఎస్పికి మాజీ ఎమ్మెల్యే ఫిర్యాదు



**కావలి, జూన్ 24 ప్రభాతవార్త :** కావలి నియోజకవర్గంలో సోషల్ మీడియా వేదికగా తనపై అత్య ప్రచారం చేస్తూ పోస్టులు పెడుతున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కావలి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి జిల్లా ఎస్‌పికి బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలకపాటి మధు, చిలకపాటి మనోహర్, గొర్రెపాటి హరీష్, తోకల శ్రీను, మదుకిషోర్‌లు సోషల్‌మీడియాలో తనపై అసత్య, అవమానకర పోస్టులు, వ్యాఖ్యలు పెడుతున్నారని తెలిపారు. దీంతో తన వ్యక్తిగత గౌరవం, సామాజిక ప్రతిష్ట దెబ్బతింటోందన్నారు. దీనిపై గతనెల 14న కావలి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా డిఎస్‌పి దృష్టికి తీసుకెళ్లి లిఖితపూరితంగానూ, ఆధారాలు చూపించానన్నారు. దీనిపై పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. పరువునష్టం కలిగించేపోస్టులు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు పాల్పడకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. నేను చేసిన ఫిర్యాదుపై న్యాయం చేయాలని ఎస్‌పిని కోరినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వెంట వైసిపి పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యఓఉలు కన్నమర్లపూడి వెంకటనారాయణ, జిల్లా ఎస్‌పి సెల్ అధ్యక్షులు పందిటి కామరాజు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూములను తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్



**దుత్తలూరు జూన్ 24 ప్రభాతవార్త** మండలంలోని దుత్తలూరులో ఎంఎస్‌ఎంఈ పార్క్, పాపం పల్లిలో అనా డ్రోన్ పరిశ్రమ ఏర్పాటు చేయబోయే భూములను బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ మొగలి వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన రెవిన్యూ అధికారులను అడిగి పరిశ్రమలకు ఎంత భూమి తీసుకున్నారు.ఎంత మంది రైతులు ఉన్నారు. వాటిలో పట్టాభూమి ఎంత,ప్రభుత్వ భూమి ఎంత తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో తహసిల్దారు యనమల నాగరాజు, కంపెనీ ప్రతినిదులు,రెవిన్యూ సిబ్బంది పాల్గోన్నారు.

## 1 నుండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్ పోస్టుల వద్ద ఈ ట్రాన్స్ పోర్ట్ పర్మిట్ విధానం అమలుకు శ్రీకారం



**నెల్లూరు, జూన్ 24, ప్రభాతవార్త – అగ్రికల్చర్ :** ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ వారు నూతనంగా ఈ ట్రాన్స్ పోర్ట్ పర్మిట్ విధానం తీసుకొని వచ్చిందని నెల్లూరు మార్కెటింగ్ శాఖ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎం. శ్రీనివాసులు తెలిపారు. బుధవారం నెల్లూరు అగ్రికల్చర్ మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో ఈ ట్రాన్స్ పోర్ట్ పర్మిట్ విధానంపై ఆయన వ్యాపారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్ పోస్టుల వద్ద ఈ ట్రాన్స్ పోర్ట్ పర్మిట్ విధానం ఇకపై అమలు చేయనుందన్నారు. వ్యాపారస్తులు అందరు మార్కెట్ కమిటీల యందు రిజిస్ట్రేషన్ చేసుకొని, లైసెన్స్ కలిగిన వ్యాపారస్థులు స్వతహాగా ఆన్ లైన్ ఈ పర్మిట్ తీసి సరుకు ఎగుమతి చేస్తున్న వాహన డ్రైవర్కు ఇచ్చి పంపాలన్నారు. వాహన డ్రైవర్ ఆన్ లైన్ ఈ పర్మిట్ మొబైల్ కు వచ్చిన పర్మిట్ నెంబర్ ను చెక్ పోస్ట్ వద్ద చూపించి వెళ్లే విధంగా సులభతరంగా చేసినట్టు తెలిపారు. వ్యాపారం సులువుగా చేసుకునేటట్లు ఏర్పాటు చేసిన విధానాన్ని అందరూ అనుసరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల తేది 30 వరకే చెక్ పోస్టుల వద్ద రశీదులు మాన్యువల్గా రాసి ఇవ్వడం జరుగుతుందని, జూలై 1 నుండి మొబైల్ యాప్ ద్వారా మార్కెట్ ఫీజు వసూలు చేస్తారని వెల్లడించారు. జూలై నెల నుండి నగదు ఆన్ లైన్ లోనే ప్రభుత్వానికి చెల్లించవలసి ఉంటుందన్నారు. రశీదు కూడా ఆన్ లైన్ లోనే చేసుకొని రావాలని కోరారు. ఈ వ్యాపారస్థుల అవగాహన సమావేశానికి జిల్లా వ్యవసాయ వ్యాపార, మార్కెటింగ్ అధికారి, అనిత కుమారి, యం. శ్రీనివాసులు, ఉన్నతశ్రేణి కార్యదర్శి వారి సమక్షంలో జి. సురేష్, సూపర్ వైజర్ ట్రైనింగ్ ఇవ్వడమైనది. వ్యాపార సంఘాలు, రియాజ్, సూపర్ వైజర్, సుధాకర్, సూపర్ వైజర్, రమేష్, యుడిసి సుకుమార్, యల్డిసి హాజరయ్యారు.

## మహిళలు, పిల్లల్లో ఆత్మహత్యలు నివారణ అనే అంశంపై అవగాహన సదస్సు



**నెల్లూరు అగ్రికల్చర్, జూన్ 24, ప్రభాతవార్త :** ఐసీడిఎస్ పీడి బి.హేనా సుజన్ ఆదేశాల మేరకు బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా బుధ వారం మహిళలు, పిల్లలలో ఆత్మహత్యలు నివారణ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నెల్లూరు, బుజబుజ నెల్లూరులోని శేషు ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థినీ, విద్యార్థులకు ఈ అవగాహన కార్యక్రమం జరిగినది. ఇందులో 9వ తరగతి, 10వ తరగతి విద్యార్థులు 150 మందికి పైగా పాల్గొని, విద్యార్థులు, మహిళలు, బాలికలపై హింస, వేధింపులు, బాలల రక్షణ, ఆత్మహత్యల నివారణ మరియు అత్యవసర సహాయ సేవలపై అవగాహన కల్పించారు. అంతే కాకుండా విద్యార్థినీ, విద్యార్థులకు మహిళల భద్రత, బాలల హక్కులు, లైంగిక వేధింపుల నివారణ, సైబర్ భద్రత, మానసిక ఆరోగ్యానికి సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. జీవితంలో ఎదురయ్యే ఒత్తిడులు, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటూ అవసరమైన సమయంలో సహాయం పొందాలని సూచించారు. అదేవిధంగా అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే మహిళా హెల్ప్లైన్-181, చైల్డ్ హెల్ప్లైన్-1098,-14416 మానసిక ఆరోగ్య సహాయక నంబర్ల గురించి వివరించారు. అలాగే మానసిక సమస్యలు, కుటుంబ సమస్యలు లేదా వ్యక్తిగత ఇబ్బందులు ఎదురైనప్పుడు కౌన్సిలింగ్ సేవలను వివరించారు. మహిళలు, బాలల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శేషు స్కూల్ కరెస్పాండంట్ బి.శేషు, శశికళ ఇంచార్జి, శాఖవరపు వేణుగోపాల్ జిల్లా పీఎంపీ అధ్యక్షులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. క్రిప్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు వై. శ్రీనివాసులు పాల్గొన్నారు.

## శివాలయంలో గర్భాలయ అంకురార్పణ



**కలిగిరి,జూన్24, ప్రభాతవార్త;** కలిగిరి శివాలయంలో బుద వారం మరోఘట్టం ప్రారంభమైంది. ఇటీవల కాలంలో శివాల యం నిర్మాణానికి సంభందించి స్వామి అమ్మవార్ల ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు జరిగి ద్విజయంగా పనులు జరుగుతుండగా బుదవారం ఆలయ నిర్మాణంలో మరోఘట్టం ప్రారంభమైంది. ఆలయ పండితులు, ఆలయ ధర్మకర్తలు, ఆలయపెద్దలు, గ్రామపెద్దల సమక్షంలో స్వామి అమ్మవార్ల గర్భా లయ గట్టానికి సంభందించిన పనులను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమం ఆలయ పండితులు ఆదిత్యశర్మ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి అందరి సమక్షంలో గర్బాలయ గట్టాన్ని ప్రారంబించారు.ఈ కార్యక్రమానికి గ్రామస్తులు, పెద్దలు పాల్గొన్నారు.

## గాంధీనగర్ అభివృద్ధికి రూ.2.75 కోట్ల పనులకు శ్రీకారం



**నెల్లూరు రూరల్,జూన్ 24 ప్రభాతవార్త:** అమర జవాన్ మురళీ నాయక్ పేరును గాంధీనగర్ రోడ్డుకు పెడతాం ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డినెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామని, ప్రజలకు ఎక్కడ ఏ సమస్య ఉన్నా నేరుగా తనను సంప్రదించాలని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. భారత్ సింధూర్ యుద్ధంలో వీరోచితంగా పోరాడి అమరుడైన ఆంధ్రప్రదేశ్కు చెందిన జవాన్ మురళీ నాయక్ సేవలను స్మరించుకుంటూ, ఆయన పేరును గాంధీనగర్ ప్రధాన రోడ్డుకు అతిత్వరలో నామకరణం చేస్తామని ప్రకటించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 29వ డివిజన్లో రూ.2 కోట్ల 75 లక్షల వ్యయంతో చేపట్టనున్న గాంధీనగర్ మెయిన్ రోడ్డు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులను జనసేన వీరమహిళల వాణి, కృష్ణవేణి చేతుల మీదుగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ప్రారంభించారు.ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, గాంధీనగర్ తరహాలోనే నెల్లూరు రూరల్ వ్యాప్తంగా రహదారులు, సెంట్రల్ లైటింగ్ పనులను చేపట్టి మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు. ఎన్నికల లేని సమయంలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధినే పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తున్నామని చెప్పారు.ప్రజలు శాసనసభ్యుడు అంటే ఇలా ఉండాలి అని చెప్పుకునేలా తన శక్తికి మించి పనిచేస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఈ వయసులో కూడా అహర్నిశలు కష్టపడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జులు, కోక్లస్టర్ ఇంచార్జులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్వాడీ ఉద్యోగాలకు ధరఖాస్తు గడువు పెంపు



**రాపూరు,జూన్24ప్రభాతవార్త :** రాపూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా వున్న అంగన్వాడీ కార్యకర్తలు, మినీ అంగన్వాడీ కార్యకర్తలు, అంగన్వాడీ సహాయకుల పోస్టులకు సంబంధించి ధరఖాస్తు గడువును జూన్ 30వ తేది వరకు పెంచినట్లు రాపూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి వి. సునంద తెలిపారు. నెల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని రాపూరు,సైదాపురం మండలాల్లోని అంగన్వాడీ కార్యకర్తలు, మినీ అంగన్ వాడి కార్యకర్తలు,సహాయకుల పోస్టులకు మాత్రమే ఈ పొడిగింపు వర్తిస్తుందని ఆమె తెలిపారు.అర్హత కలిగిన వారు ఈ నెల 30వ తేది సాయంత్రం 5 గంటల లోపు రాపూరులోని సిడిపిఒ కార్యాలయంలో ధరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

## బ్యాంకు ఆఫ్ ఇండియాలో చెలరేగిన మంటలు



**కావలి, జూన్ 24 ప్రభాతవార్త :** కావలి జనతాపేటలోని బ్యాంకు ఆఫ్ ఇండియా బ్యాంకులో బుధవారం విద్యుత్షార్ట్ సర్క్యూట్తో మంటలు వ్యాపించడం జరిగింది. మంటలు రావడంతో బ్యాంకు సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. వెంటనే ఫైర్ సిబ్బంది ఫోన్ చేయగా అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో పలు పాత రికార్డులు,ఫైళ్ళు దగ్ధం కావడం జరిగింది. బ్యాంకు పొగలు రావడాన్ని గమనించిన సిబ్బంది వెంటనే పరుగులుతీసి బయటకు రావడంతో ఎలాంటి ప్రాణనష్టం కలగలేదు. దీంతో సిబ్బంది, బ్యాంకు అధికారులు ఊపిరిపీల్చుకొన్నారు.

## ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



**కావలి, జూన్ 24 ప్రభాతవార్త :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణ పరిధిలోని ముసునూరు, పాతూరు, వివేకానంద పార్కులో పోలింగ్ స్టేషన్ నెంబర్ 37, 38, 122,132లో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పనులను మున్సిపల్ కమిషనర్ శ్రావణ్కుమార్ పరిశీలించారు. ఈ పరిశీలనలో కమిషనర్ ఓటరుజాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని సంబంధిత బిఎల్ఓలను ఆదేశించడం జరిగింది.

## నూతన దంపతులను ఆశీర్వదించిన ప్రసన్నకుమార్రెడ్డి



**విడవలూరు,జూన్ 24 ప్రభాతవార్త:** రామతీర్థం గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం లో నిర్వహించిన సునీల్-సుమతి కళ్యాణ మహోత్సవంలో మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్రెడ్డి పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. విడవలూరు మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుచ్చింగారి తిరుపతయ్య సోదరుడు బుచ్చింగారి బాబు, మల్లేశ్వరి దంపతుల కుమారుడు సునీల్కు సుమతితో వివాహం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన ప్రసన్నకుమార్రెడ్డి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి, సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకులు వీరి చలపతిరావు, కొండూరు అనిల్బాబు, కాటంరెడ్డి నవీన్రెడ్డి, అనపల్లి ఉదయభాస్కర్, వవీళ్ళ రాజేష్, వి. గోవిందు, కుమారి నరసింహ, ప్రళయకావేరి భాషా తదితరులతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## వార్తకు స్పందన: సర్ ప్రక్రియపై తహశీల్దార్ పర్యవేక్షణ



**విడవలూరు,జూన్ 24 ప్రభాతవార్త:** సర్ ప్రక్రియలో వీఆర్వోల తీరుపై ప్రజల నుంచి వస్తున్న ఆరోపణలు, అనుమానాల నేపథ్యంలో ప్రభాతవార్తలో బుధవారం ప్రచురితమైన కథనానికి స్పందించిన తహశీల్దార్ ఏ. లక్ష్మీ ప్రసన్న అన్నారెడ్డిపాలెం గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రక్రియను పరిశీలించారు.గ్రామంలో జరుగుతున్న సర్ ప్రక్రియను స్వయంగా పరిశీలించిన ఆమె, అక్కడ ఉన్న ఓటర్లతో మాట్లాడి ఫారాల పంపిణీ, నమోదు ప్రక్రియ, సిబ్బంది పనితీరుపై వివరాలు తెలుసుకున్నారు. ఓటర్లకు సమాచారం అందకుండా కార్యాలయంలోనే ప్రక్రియ పూర్తవుతోందన్న ఆరోపణలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, మండలంలో సర్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడంలో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు. ప్రతి అర్హ ఓటరుకు సమాచారం అందేలా చర్యలు చేపట్టి, ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. విధుల్లో నిరక్ష్యం వహించినా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో, బి ఎల్ వో తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: సీఐ దుర్గాప్రసాద్



**కొడవలూరు,జూన్ 24 ప్రభాతవార్త:** మండలంలోని నార్త్ రాజుపాలెంలోని జీవన్జ్యోతి కళాశాలలో బుధవారం మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కొడవలూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఓ. దుర్గాప్రసాద్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని అన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, క్రమశిక్షణపై దృష్టి సారించాలని సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక సమస్యలను వివరించి విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా మత్తు పదార్థాల విక్రయాలపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటర్ల సర్వే 75 శాతం పూర్తి



**కొడవలూరు, జూన్ 24 ప్రభాతవార్త:** మండలంలో చేపట్టిన ఓటర్ల సర్వే ప్రక్రియలో 75 శాతం పనులు పూర్తయ్యాయి. మొత్తం 41,244 మంది ఓటర్లకు సంబంధించి సర్వే నిర్వహిస్తుండగా, ఇప్పటివరకు 30,620 వేల మంది వివరాల నమోదు పూర్తయినట్లు తహశీల్దార్ కె.స్ఫూర్తి రెడ్డి తెలిపారు.బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తూ, అవసరమైన పత్రాలను అందజేస్తున్నారని పేర్కొన్నారు. సర్వే పూర్తయిన అనంతరం సేకరించిన వివరాలను సంబంధిత యాప్లో నమోదు చేయనున్నట్లు వివరించారు.మిగిలిన 25 శాతం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులనుఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పారదర్శకంగా, నిర్దేశిత గడువులోపు సర్వే ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

## రైతులకు ఆర్పీఎల్ శిక్షణ

**: ఆధునిక సాగు పద్ధతులపై శాస్త్రవేత్తల అవగాహ**



**కొడవలూరు, జూన్ 24 ప్రభాతవార్త:** మండలంలోని యల్లాయపాలెం గ్రామంలో 'ఆత్మ' ఆధ్వర్యంలో రైతులకు ఆర్పీఎల్ (పూర్వ అనుభవ గుర్తింపు) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ అనిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ, ఆక్వా రంగాలకు చెందిన శాస్త్రవేత్తలు ఆధునిక సాగు పద్ధతులు, సమగ్ర ఎరువుల యాజమాన్యం, జీవన ఎరువుల వినియోగం, సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.చెన్నైకి చెందిన సీఐబీఏ శాస్త్రవేత్తలు వినయ్కుమార్, అశోక్కుమార్లు రొయ్యల పెంపకంలో యాంటీబయోటిక్స్ కు బదులుగా ప్రోబయోటిక్స్ వినియోగించాలని సూచించారు. ఏడీఏ అనిత మాట్లాడుతూ మండలంలో యూరియా కొరత లేదని, ప్రతి రైతుకు అవసరమైన ఎరువులను సకాలంలో అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఆత్మపీడీ ఉషారాణి, మండల వ్యవసాయ అధికారిణి విజయలక్ష్మి , వై.వంశీధర్ రెడ్డి, ఎంపీటీసీ గరికపాటి రాజేంద్ర, శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## వావిళ్లలో కార్డన్ అండ్ సెర్చ్ పత్రాలు లేని 20 వాహనాలు స్వాధీనం



**విడవలూరు,జూన్ 24 ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ అజిత వెజెండ్ల ఆదేశాల మేరకు, రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు సూచనలతో కొడవలూరు సీఐ దుర్గాప్రసాదరావు ఆధ్వర్యంలో బుధవారం వావిళ్ల గ్రామంలో సబ్ డివిజన్ సిబ్బందితో కలిసి కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ తదితర పత్రాలను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, తద్వారా విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 112, 100 నంబర్ల ద్వారా పోలీసుల సహాయం పొందవచ్చని చెప్పారు. మహిళల భద్రత కోసం శక్తి యాప్ను మొబైల్ ఫోన్లలో డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు.అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల్లో బాధితులను సమీప ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడేందుకు ముందుకు రావాలని కోరారు. తల్లిదండ్రులు పిల్లలకు మొబైల్ ఫోన్లు ఇచ్చే విషయంలో అప్రమత్తంగా ఉండాలని, వాటి దుర్వినియోగం వల్ల పిల్లలు చెడు అలవాట్లకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.కార్డన్ అండ్ సెర్చ్ సందర్భంగా పత్రాలు లేని 20 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటిని పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై నరేష్తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట



**కావలి, జూన్ 24 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం గౌరవరం గ్రామానికి చెందిన ఉప్పు మేఘన పువ్వల దొరవు గ్రామానికి చెందిన గల్ల శ్రీనుల ప్రేమజంట బుధవారం కావలి రూరల్ పోలీసులను ఆశ్రయించి రక్షణ కల్పించాలని కోరడం జరిగింది. ఈ సందర్భంగా ప్రేమజంట మాట్లాడుతూ మీమిద్దరం మేజర్లమని, గత నాలుగు ఏళ్ళు నుంచి ప్రేమించుకుంటున్నామని మా వివాహానికి మేఘన తల్లిదండ్రులు అడ్డుపడుతున్నందున మేము రూరల్ మండలం అన్నగారిపాలెం సమీపన ఉన్న శ్రీ ముందర పొట్టమ్మ ఆలయంలో వివాహం చేసుకోవడం జరిగిందని తెలిపారు. పెద్దల నుంచి రక్షణ కోసం కావలి డిఎస్పిని ఆశ్రయించగా ఆయన అందుబాటులో లేకపోవడంతో రూరల్ పోలీస్స్టేషన్కు రావడం జరిగిందన్నారు. మేఘన తల్లిదండ్రుల నుంచి ప్రాణహాని ఉందని వారినుండి రక్షణ కోసం పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు.

## తిరుపతి పార్లమెంట్ జనసేన పరిశీలకునిగా జల్లెల రాజేష్



**రాపూరు,జూన్24ప్రభాతవార్త :** తిరుపతి పార్లమెంట్ జనసేన పార్టీ పరిశీలకునిగా రాపూరు పట్టణానికి చెందిన సీనియర్ జనసేన నాయకుడు జల్లెల రాజేష్ను అధిష్టానం నియమించింది. జనసేన పార్టీ బలోపేతంలో భాగంగా జనసేన నిర్మాణ సారధుల సమాచార కమీటి పరిధిలోని వెంకటగిరి నియోజకవర్గ పార్లమెంట్ అబ్జర్వర్లుగా వెంకటగిరి నియోజకవర్గం నుండి ముగ్గురిని నియమించగా అందులో రాపూరుకు చెందిన జల్లెల రాజేష్ ఒకరు. ఇటీవలే తిరుపతి పార్లమెంట్ అబ్జర్వర్గా నియమితులైన లోకం మాధవి పర్యవేక్షణ లో ఈ కమిటీ పనిచేయనుంది. నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులు, ప్రజా సమస్యలను సేకరించి అధిష్టానానికి చేరవేయడంలో వీరు కీలక పాత్ర పోషించనున్నారు. జల్లెల రాజేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో భాద్యతను అప్పగించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్కి, తిరుపతి పార్లమెంట్ అబ్జర్వర్ లోకం మాధవికు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు,సమాచార సేకరణ కమిటీ అశయాలకు అనుగుణంగా తన శాయశక్తుల కృషి చేయడం జరుగుతుందన్నారు.

## లింగాకర్షక బుట్టల పంపిణీ, అవగాహన సదస్సు: ఏడీఏ అనిత



**విడవలూరు, జూన్ 24 ప్రభాతవార్త:** విడవలూరు మండలం ముదివర్తి గ్రామంలో రైతులకు పూర్వ అభ్యాస శిక్షణా కార్యక్రమం కోవూరు ఏడీఏ జి.అనిత ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా వేరుశనగ రైతులకు లింగాకర్షక బుట్టలను పంపిణీ చేసి వాటి వినియోగంపై విపులంగా అవగాహన కల్పించారు. అనంతరం వేరుశనగ పంటలో బుట్టల అమరికపై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించి రైతులకు క్షేత్రస్థాయి అవగాహన కల్పించారు.అలాగే రైతులకు యూరియా పంపిణీని ఏపీ ఎయిమ్స్ 2.0 యాప్ ద్వారా చేపట్టే విధానాన్ని అధికారులు వివరించారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా నీటి భద్రత, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, డిమాండ్ ఆధారిత పంటలు, పీఎండీఎస్ కిట్స్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు.ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వేరుశనగ పంటలో బీజామృతం వినియోగ విధానాన్ని వివరించి డెమో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారిని సీహెచ్ఎస్ లక్ష్మి వీఏఏ వెన్నెల పాల్గొన్నారు.

## 27న జరిగే అంగన్వాడీ ఇంటర్వ్యూలు వాయిదా



**కోవూరు, జూన్24 ప్రభాతవార్త :** నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో ఈ నెల 27వ తేది నిర్వహించనున్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలకు సంబంధించిన ఇంటర్వ్యూలను వాయిదా వేయడం జరిగిందని సీడీపీవో టి. శారద తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కోవూరు, బుచ్చి మండలానికి సంబంధించి ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారు ఈ విషయాన్ని గమనించాలన్నారు. తదుపరి ఇంటర్వ్యూలు ఎప్పుడు ఉంటాయో తెలియజేయడం జరుగుతుందన్నారు.

## అంగన్వాడీ ఫోస్టులకు ధరఖాస్తులు చేసుకోవాలి

**కావలి, జూన్ 24 ప్రభాతవార్త :** కావలి డివిజన్లోని ఐసిడిఎస్ ప్రాజెక్టు పరదిలో ఉన్న అల్లూరు, బోగోలు, దగదర్తి, కావలి రూరల్ మండలాల్లో ఖాళీగా ఉన్న 4 అంగన్వాడీ కార్యకర్తలు, 21 అంగన్వాడీ సహాయకుల పోస్టులకు అర్హత గల అభ్యర్థుల నుంచి ధరఖాస్తులు స్వీకరించనున్నట్ల ప్రాజెక్టు ఇన్చార్జ్ ఎం.రాజ్యలక్ష్మి బుధవారం ఓ ప్రకటలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ అదేశాల మేరకు అంగన్వాడి పోస్టులకు దరఖాస్తులు చేసుకునే అవకాశాన్ని కల్పించడం జరిగిందన్నారు. ఈపోస్టులకు అర్హత కలిగిన వారు ఈనెల 30లోపు ధరఖ్తాసులను సాయంత్రం 5గంటలోపు అందజేయాలని కోరడం జరిగిందనానరు.

## సమర శంఖారావ బహిరంగ సభను జయప్రదం చేయాలి



**కావలి, జూన్ 24 ప్రభాతవార్త :** ఈనెల 28న ఏలూరు పట్టణంలో జరిగే దళిత క్రైస్తవ సమర శంఖారావ బహిరంగ సభకు తరలి రావాలని జై బీమ్రావు భారత్పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్మైనంపాటి ఏసురత్నం కోరారు. ఈ సందర్భంగా బహిరంగసభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. పట్టణంలోని జెబిపి కార్యాలయంలో నిర్వమించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 28న ఏలూరు పట్టణంలో జివిఆర్ సెయింట్ స్కూల్గ్రౌండ్లో నిర్వహించే బహిరంగసభకు ఏర్పాట్లు చేయడం జరగుతుందని తెలిపారు. ఈసభకు వేలాదిగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సభా జెబిపి వ్యవస్థాపక అధ్యక్షులు జడ శ్రావణ్కుమార్ నాయకత్వంలో జరగనున్నట్లు తెలిపారు. కావున ప్రతి క్రైస్తవులు ఈ సభకు హాజరు కావాలని ఈ సభలో భారత రాజ్యాంగంలోని అర్టికల్ 25, 26, 27 ఎస్సీలకు స్వచ్ఛగ మతపరమైన స్వతంత్రతను కలిగి ఉండే ఉద్యదమ సభకు తరలిరావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ నాయకులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**: జనసేన నాయకులు జీవన్ కృష్ణ**



**విడవలూరు, జూన్ 24 ప్రభాతవార్త:** మండలంలోని ఊటుకూరు, పెద్ద పా లెం గ్రామాలలో 'ఛాయ్ విత్ సైనిక్ జనసేన' కార్యక్రమాన్ని కోవూరు నియోజకవర్గ జనసేన నాయకుడు గాదిరాజు జీవనకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. జొన్నవాడ దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు నక్కల శివకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన యువకులకు పార్టీ బలోపే తంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్య మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి కార్యకర్త ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. పారదర్శక పాలన, అవినీతి రహిత సమాజ నిర్మాణం, యువతకు ప్రాధాన్యత, సామాజిక బాధ్యత వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల నాయకుడు పి. మల్లికార్జున్, యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్సీపీ నేతల కుటుంబ వివాహ వేడుకలకు మేకపాటి హాజరు



వింజమూరు, జూన్ 24, ప్రభాతవార్త నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి బుధవారం వింజమూరు, చాకలకొండ గ్రామాల్లో జరిగిన వైఎస్ఆర్సీపీ నేతల కుటుంబ వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మండల కేంద్రం వింజ మూరులో మాజీ ఉప సర్పంచ్ మిడదాల జయలక్ష్మి, రాజారాం రెడ్డి దంపతుల కుమారుడు సాయి కుమార్ రెడ్డి వివాహానికి హాజరైన మేకపాటి, మంగళాక్షతలతో ఆశీర్వదించారు. వారి దాంపత్య జీవితం నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. అలాగే చాకల కొండ గ్రామంలో వైఎస్ఆర్సీపీ నేత పోలుబోయిన వెంకటేశ్వర్లు కుమార్తె సుప్రియ నిశ్చితార్థ వేడుకకు హాజరై ఆశీర్వదించారు. తలంబ్రాల కార్యక్రమంలో పాల్గొని వధువును మంగళాక్షతలతో దీవించారు. ఈ కార్యక్రమాల్లో మేకపాటి వెంట జడ్పీటీసీ సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, వైఎస్ఆర్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు పల్లాల కొండారెడ్డి, మండల కన్వీనర్ రేవనూరు శ్రీనివాసులు రెడ్డి, మద్దూరు లక్ష్మి ప్రసాద్ రెడ్డి, దాట్ల విజయ భాస్కర్ రెడ్డి, కాటం రవీంద్రారెడ్డి, పాలూరి మాల్యాద్రి రెడ్డి, గణపం రమేష్ రెడ్డి, మలిరెడ్డి విజయ్ కుమార్ రెడ్డి, మద్ది రెడ్డి వీరారెడ్డి తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## రెండు వైన్‌షాపులలో చోరీ

**దుత్తలూరు జూన్ 24 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన దుత్తలూరులో రెండు వేరువేరు చోట్ల ఉన్న వైన్ షాపుల్లో మంగళవారం రాత్రి దుండుగు చోరీకి పాలుపడ్డారు. ఒక దుకాణంలో లక్ష రూపాయాలు నగదు, మరో దుకాణంలో కొద్దిపాటి నగదు, మద్యాన్ని అపహరించారు. ఉదయాన్నే గమనించని దుకాణాల సిబ్బంది ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు స్వాతీ నక్షత్రం సందర్భంగా వేదగిరిపై స్వామివారికి శేష వాహన సేవ



**నెల్లూరు, జూన్ 24, ప్రభాతవార్త – అగ్రికల్చర్ :** నెల్లూరు రూరల్ మండలం, నరసింహకొండ పై వేదగిరి క్షేత్రముగా వెలసియున్న శ్రీ వేదగిరి లక్ష్మి నరసింహస్వామి వారి దేవస్థానం నందు గురు వారం స్వాతి నక్షత్రం, నిర్జల ఏకాదశి విశేష పర్వదినం సందర్భంగా స్వామివారికి ఉదయం 8:00 గంటలకు పంచామృత అభిషేకం, 10 గంటలకు తిరుప్పావడ సేవ నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వేమూరి గోపి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వాతి నక్షత్రం సందర్భంగా ఈ నెల మొట్ట మొదటి సారిగా రాత్రి 7 గంటలకు స్వామి వారికి శేష వాహనంపై గిరి ప్రదక్షిణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక నుండి ప్రతి స్వాతి నక్షత్రం రోజున రాత్రి 7 గంటలకు శేష వాహన సేవ కొరకు భక్తులు ఆలయ కార్యాలయం వద్ద సంప్రదించాల్సిందిగా తెలియచేసారు. స్వామివారి ఉత్సవాలను తిలకించి స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కాగలరని కోరుతున్నట్టు తెలిపారు.

## 30న అంగన్‌వాడి పోస్టులకు దరఖాస్తుకు ఆహ్వానం

**నెల్లూరు సిటీ, జూన్ 24, ప్రభాతవార్త :** నెల్లూరు రెవెన్యు డివిజన్ పరిధిలోని ఐసిడియస్ ప్రాజెక్ట్ నెల్లూరు పరిధిలోని నెల్లూరు అర్బన్, నెల్లూరు రూరల్ మండలాలలో ఖాళీగా ఉన్న 15 అంగన్‌వాడి హేల్పెర్స్ పోస్టులకు మే 7వ తేదిన పత్రికా ప్రకటన ద్వారా అర్హత కల్గిన అభ్యర్థుల నుండి మే 25వ తేది వరకు దరఖాస్తులు స్వీకరించామని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖాధికారి హేన సృజన తెలిపారు. జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు సదరు పోస్టులకు ఈ నెల 30వ తేది వరకు దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించియున్నారన్నారు. అందువల్ల అర్హత కల్గిన అభ్యర్థులు వున్న ఈ నెల 30వ తేది సాయంత్రం 5 గంటల లోపల కార్యాలయం నందు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు.

## జేసీని కలిసిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పరిరక్షణ కమిటీ



**నెల్లూరు, జూన్ 24, ప్రభాతవార్త – కలెక్టరేట్ :** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు కొప్పాల రఘు వారి బృందం జిల్లా మహిళా కన్వీనర్ ఎన్. జయశ్రీ, నెల్లూరు నగర అధ్యక్షురాలు సీహెచ్. నాగమణితో బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు ఐఏఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి షీల్డ్, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారులు గాడ నిద్రలో నుంచి బయటికి వచ్చి జస్టిస్ కె. పున్నయ్య కమిషన్ సిఫారసు అమలు చేయడంలో భాగంగా మండల లెవెల్ తాసిల్దార్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ నివాస ప్రాంతాలలో ప్రతినెల చివరి తేదీన జరిగే పౌర హక్కుల దినోత్సవం గ్రామసభలో ఎస్సీ ఎస్టీ నాయకులను, స్వచ్ఛంద సేవ సంస్థ ఎన్జీవోలను మమేకం చేసి సభలు నిర్వహించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ భూ సమస్యలను న్యాయబద్ధంగా, వేగంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా అట్రాసిటీ కేసుల గురించి, మహిళా భద్రత గురించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వెంట ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పరిరక్షణ కమిటీ నేతలు వెంకటేశ్వర్లు, రత్నం ఉన్నారు.

## రొట్టెల పండుగకు విస్తృత ట్రాఫిక్ ఏర్పాట్లు

**– ప్రత్యేక పార్కింగ్ జోన్లు, ఆంక్షలు ప్రకటించిన పోలీసు శాఖ**

**నెల్లూరు క్రైం, జూన్ 24, ప్రభాతవార్త :** నెల్లూరులోని బారా షాహీద్ దర్గా వద్ద జూన్ 26 నుంచి 30 వరకు నిర్వహించనున్న రొట్టెల పండుగ సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా ఎస్పీ డా. ఆజిత వేజెండ్ల ఆదేశాల మేరకు, టౌన్ ఏఎస్పీ దీక్ష సూచనలతో నెల్లూరు సిటీ ట్రాఫిక్ విభాగం ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, కట్‌ఆఫ్ పాయింట్లు, పార్కింగ్ ప్రాంతాలను ప్రకటించారు. జూన్ 25 నుంచే భక్తులు, సందర్శకుల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ విధానాన్ని అమలు చేయనున్నారు. చెన్నై, గూడూరు వైపు నుంచి వచ్చే వాహనాలను అయ్యప్పగుడి-మినీ బైపాస్ మార్గంలో సైన్స్ పార్క్, ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాలకు మళ్లించనున్నారు. విజయవాడ, కావలి, కడప, ఆత్మకూరు, బుచ్చి ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు ఎన్‌హెచ్16 మీదుగా ఎస్‌వీజీఎస్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన పార్కింగ్‌లో నిలపాల్సి ఉంటుంది. జొన్నవాడ మార్గం నుంచి వచ్చే వాహనాలను డీఎస్ఎన్ మినీ ఫంక్షన్ హాల్ ముందు, వెనుక ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రాంతాలకు, రాపూరు, పొదలకూరు వైపు నుంచి వచ్చే వాహనాలను ప్రసార భారతి (ఆల్ ఇండియా రేడియో స్టేషన్) సమీపంలోని పార్కింగ్ స్థలాలకు మళ్లించనున్నారు. తిరుగు ప్రయాణంలో కూడా వాహనదారులు సూచించిన మార్గాల ద్వారానే వెళ్లాలని పోలీసులు సూచించారు. భక్తుల సౌకర్యార్థం అన్ని పార్కింగ్ ప్రాంతాల్లో బయో టాయిలెట్లు, టెంట్లు, తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బట్వాడిపాలెం సెంటర్, డీఎస్ఆర్ జంక్షన్, పెట్రోల్ బంక్ జంక్షన్, పొదలకూరు రోడ్ జంక్షన్ల నుంచి దర్గా వైపు అనుమతి లేని వాహనాలకు ప్రవేశం ఉండదని స్పష్టం చేశారు. అలాగే రొట్టెల పండుగ సందర్భంగా దర్గా పరిసర ప్రాంతాల్లో ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్లు, లారీలు తదితర భారీ వాహనాల రాకపోకలను నిషేధించినట్లు తెలిపారు. భక్తులు, సందర్శకులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఓట్ల ధృవీకరణ చేపట్టిన తెలుగుదేశం నాయకులు



**చేజర్ల, జూన్ 24, ప్రభాతవార్త :** కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా చేజర్ల మండలం మడపల్లి గ్రామ పంచాయతీలో బుధవారం ఓట్ల దృవీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని 242, 243 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఓటర్ల వివరాల వెర్పికేషన్ చేపట్టగా, ఈ కార్యక్రమంలో చేజర్ల మండల తెలుగుదేశం పార్టీ నాయకులు భారత్ మహాసేన అధ్యక్షులు జువ్విగుంట బాబు పాల్గొన్నారు. వారు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకునేలా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జువ్విగుంట బాబు మాట్లాడుతూ గ్రామంలో 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత అధిక సంఖ్యలో ఉన్నారని అర్హత కలిగిన ప్రతి యువకుడు, యువతి ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైందని, ప్రతి పౌరుడు తన ఓటును నమోదు చేసుకొని ఎన్నికల్లో పాల్గొనాలని సూచించారు. ఓటర్ల జాబితాలో పేర్లు లేని వారు, వివరాల్లో మార్పులు ఉన్న వారు సంబంధిత అధికారులను సంప్రదించి సవరణలు చేయించుకోవాలని తెలిపారు. ఎన్నికల కమీషన్ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ కృష్ణ, తెలుగుదేశం పార్టీ నాయకులు దాసరి నరసింహులు, మురికిపాటి భాస్కర్, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వంతెనను ఢీకొట్టిన ఆర్టీసి బస్సు డ్రైవర్ అప్రమత్తతో తప్పిన ముప్పు



**దుత్తలూరు జూన్ 24 ప్రభాతవార్త :** ఆర్టీసి బస్సు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహారించడంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పడంతోపాటు ప్రయాణికులు సురక్షితంగా బయటపడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల మేరకు పామూరు నుండి బద్వేలు వెళుతున్న ఉదయగిరి డిపోకు చెందిన ఆర్టీసి బస్సు తెడ్డుపాడు సమీపంలో పిల్లాపేరు వంతెన వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి వంతెన గోడలను బలండా ఢీకొట్టింది. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ చాకచక్యంగా వ్యవహారించి బస్సును నడిపి వంతెనపైన నిలిపి వేశాడు. ఆ సమయంలో బస్సులో సుమారు 40 మంది ప్రయాణికులు ఉన్నారు. డ్రైవర్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరం



**గూడూరు, జూన్ 24, ప్రభాతవార్త :** గూడూరు రూరల్ పరిధిలోని కొండగుంట గ్రామ పరిధిలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద తలమాటి శ్రీకాంత్ రెడ్డి అనే వ్యక్తి మద్యం విక్రయిస్తుండగా కేసు నమోదు చేశామని గూడూరు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎస్ఐ శేషమ్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్రమంగా మద్యం విక్రయించిన, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన చట్ట పరమైన చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్, హెడ్ కానిస్టేబుల్, టి.మనోహర్, కానిస్టేబుల్ టి. నారాయణ పాల్గొన్నారు.

## కోరం లేక సభ వాయిదా




**కోట, జూన్ 24 ప్రభాతవార్త :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. ముందుగా సభకు మండల పరిషత్ అధ్యక్షురాలు ఎంబేటి శశి అధ్యక్షత వహించారు. సర్వసభ్య సమావేశం 11.30 గంటలకు ప్రారంభం కాగా, సభలోకి కోట ఎంపిటిసిలు షంషుద్దిన్, దారా సురేష్, సిద్ధవరం సభ్యురాలు, కొత్తపాళెం ఎంపిటిసి నారాయణ హాజరయ్యారు. దీంతో మరో గంటపాటు సభను వాయిదా వేసి సభ్యుల కోసం వేచి చూశారు. అయితే సభకు మూడోవంతు సభ్యుల మెజార్టీ లేకపోవడంతో ఇన్‌ఛార్జ్ ఎంపిడిఓ శివకుమార్ ఈ సమావేశాన్ని వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సభలో తహశీల్దార్ కె.జయజయరావు, జడ్పిటిసి సభ్యుడు కోటయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నేడు యనమదలలో వన్ మంత్ వన్ విలేజ్ కార్యక్రమం

**చేజర్ల, జూన్ 24, ప్రభాతవార్త :** చేజర్ల మండలం యనమదల గ్రామ సచివాలయంలో గురువారం ఉదయం వన్ మంత్– వన్ విలేజ్ ఫోర్ విజిట్స్ కార్యక్రమం తహసీల్దార్ మస్తానయ్య అధ్యక్షతన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలో రెవెన్యూ సమస్యలపై సమావేశం నిర్వహించి గ్రామ ప్రజలు నుండి వినతులు స్వీకరించనున్నారు. ఈ సమావేశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయము, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు**

ఆర్.సి.నెం. జి1/2385/2026 తేది 24.06.2026

**షార్ట్ టెండరు ప్రకటన**

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్య పరిధిలో పని చేయుచున్న ఉపాధ్యయ మరియు ఉపాధ్యాయేతర సిబ్బంది యొక్క భవిష్య నిధి ఖాతాలు (సుమారు 9000 మంది), జిల్లా ప్రజా పరిషత్ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు కార్యాలయము సిస్టమ్ నందు సాఫ్ట్ వేర్ ఇన్‌స్టాల్ చేయుటకు గాను రిజిస్టర్ కాబడియున్న సాఫ్ట్ వేర్ డెవలపర్స్ సంస్థల లో ఆసక్తి కలిగిన టెండర్ దారులు నుండి దిగివ తెలిపిన ప్రకారం టెండర్లను ఆహ్వానించడమైనది.

1. టెండర్ షెడ్యూల్ జారీ ప్రారంభపు : తేది: 27.06.2026
2. టెండర్ షెడ్యూల్ జారికి ఆఖరు తేది : తేది: 04.07.2026 సా॥ గం.5.00 వరకు
3. టెండర్ షెడ్యూల్ దాఖలు చేయవలసిన తేది : తేది: 06.07.2026 సా॥ గం.3.00 వరకు
4. టెండర్ షెడ్యూల్ తెరవబడు తేది : తేది: 06.07.2026 సా॥ గం.4.00 వరకు
5. టెండర్ షెడ్యూల్ ఖరిదు తేది: రూ.10,000/– + 1800 (జి.యస్.టి. 18%) = రూ.11,800/–

టెండర్ షెడ్యూల్ ఖరిధు మరియు ధరావత్తు (ఇ.యం.డి) చెల్లింపులకుగాను ఎవ్వరికిని ఎలాంటి మినహాయింపులు లేవని తెలియజేయడమైనది మరియు టెండర్ పై అంతిమ అధికారం ఈ క్రింద సంతకముదారునుకు కలదు అదనపు సమాచారం కొరకు కార్యాలయపు పని దినములలో సంబందిత పరిపాలనాధికారి గారిని సంప్రదించగలరు.

సం/– **ఎల్.శ్రీధర్ రెడ్డి** ముఖ్య కార్యనిర్వహణాధికారి,
జిల్లా ప్రజా పరిషత్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

## జేసీని కలిసిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పరిరక్షణ కమిటీ



**నెల్లూరు, జూన్ 24, ప్రభాతవార్త – కలెక్టరేట్ :** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు కొప్పాల రఘు వారి బృందం జిల్లా మహిళా కన్వీనర్ ఎన్. జయశ్రీ, నెల్లూరు నగర అధ్యక్షురాలు సీహెచ్. నాగమణితో బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు ఐఏఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి షీల్డ్, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారులు గాడ నిద్రలో నుంచి బయటికి వచ్చి జస్టిస్ కె. పున్నయ్య కమిషన్ సిఫారసు అమలు చేయడంలో భాగంగా మండల లెవెల్ తాసిల్దార్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ నివాస ప్రాంతాలలో ప్రతినెల చివరి తేదీన జరిగే పౌర హక్కుల దినోత్సవం గ్రామసభలో ఎస్సీ ఎస్టీ నాయకులను, స్వచ్ఛంద సేవ సంస్థ ఎన్జీవోలను మమేకం చేసి సభలు నిర్వహించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ భూ సమస్యలను న్యాయబద్ధంగా, వేగంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా అట్రాసిటీ కేసుల గురించి, మహిళా భద్రత గురించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ పరిరక్షణ కమిటీ నేతలు వెంకటేశ్వర్లు, రత్నం ఉన్నారు.

**గ్రామ పంచాయితీ కార్యాలయము, రాపూరు**
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

ఆర్.ఓ.సి.నెం. 12/2026 తేది: 25.06.2026

**టెండరు ప్రకటన**

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, రాపూరు మండలము, రాపూరు గ్రామ పంచాయితికి చెందిన ఈ క్రింది షెడ్యూలులో కనపరిచిన పారిశుద్ధ్య సిబ్బంది సరఫరా చేయుటకు ఎదురుగా పొందుపరిచిన టెండరు ధరావత్తు రుసుము చెల్లించి సీల్డు టెండర్లు 27.06.2026ఉదయం 11.00గంటల నుండి మధ్యాహ్నం 2.00గంటల వరకు రాపూరు గ్రామ పంచాయతి కార్యాలయంలో స్వీకరించబడును. సదరు టెండర్లు అదే రోజు మధ్యాహ్నము 3.00గంటలకు హాజరైన టెండరు దారుల సమక్షమున తెరవబడును. సదరు వివరములు కార్యాలయపు పనివేళలలో తెలుసుకొనవచ్చును.

| వ.నెం. | వివరములు | ధరావత్తు |
|---|---|---|
| 1 | తే.01.4.2026 ది నుండి తే 31.03.2027 దిగ్రామ పంచాయతి పరిధిలో వీధులు శుభ్రముగాచిమ్ముటకు (మరియు) సైడ్ కాలువలు శుభ్రము చేయుటకు స్వీపర్లు 19(పందొమ్మిది మంది ) (మరియు) రక్షిత మంచినీటి సరఫరా చేయు పంపు ఆపరేటర్లు–12 (పన్నెండు మంది ) పార్కు వాచ్మెన్–1 ఒకటి, కార్యాలయము నైట్ వాచ్మెన్–1 (ఒకటి), డ్రైవర్లు –2 (రెండు), మొత్తము సిబ్బంది 35 మందిని సప్లయి చేయుటకు కాంట్రాక్టు పద్ధతిపై నియామకం మీద మనిషి ఒకటికి రోజుఒకటికి రేటు నెల 1కి రేటు సమోదు చేయవలెను. సప్లయి చేయు మొత్తము 35 మందిని గ్రామపంచాయితికి సంబంధించిన ఇతర పనులు నిర్వహణకు వినియోగించబడును. జీవో ఎంఎస్. నెం. 551. | రూ.1000 |

**గమనిక:** పై తెలిపిన టెండర్లు తేది యందు అనివార్య కారణముల వలన ప్రభుత్వం శెలవు దినముగా ప్రకటించిన యెడల మరుదినమునకు వాయిదా వేయబడునని తెలియజేయడమైనది.

సం/– అల్ల బాలకృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శి,
రాపూరు గ్రామ పంచాయితీ, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

## ట్రిబుల్ ఐటీ నందు ప్రవేశం పొందిన విద్యార్థినులకు అభినందనలు




**వింజమూరు, జూన్ 24, ప్రభాతవార్త :** వింజమూరులోని బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థినులు ట్రిబుల్ ఐటీ కళాశాలలో ప్రవేశం పొందిన సందర్భంగా ఉపాధ్యాయుని బృందం దాతలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ పాఠశాల నుండి ఏడుగురు విద్యార్థినులు ట్రిబుల్ ఐటీ నందు ప్రవేశం పొందారు. ఆ విద్యార్థులకు మొదటి స్థానం సాధించిన శ్రీజకు వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షులు పల్లాల కొండారెడ్డి పదివేల రూపాయలు నగదును సరస్వతీ శ్రీధర్ పూర్వ విద్యార్థి (ఆస్ట్రేలియా) పదివేల రూపాయల నగదును అందజేశారు. అలాగే ఐసిడిఎస్ సిడిపిఓ సిహెచ్ పద్మజ ట్రిబుల్ ఐటీ సీట్లు సాధించిన ఏడుగురు విద్యార్థినులకు 15 వేల రూపాయలను అందించారు. అదే విధంగా పూర్వ విద్యార్థి అయిన రేఖ ఆత్మకూరులోని ఆయుష్ హాస్పిటల్ నిర్వాహకులు ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలను సాధించిన విద్యార్థినులకు 15 వేల రూపాయలను అందజేశారు అదేవిధంగా మండవ వెంకటేశ్వర్లు శ్రీ వెంగమాంబ ట్రస్ట్ సభ్యులు 10 వేల రూపాయలను 585 మార్కులు సాధించిన అక్షయకు అందించారు. ఏం విజయ్ కుమార్ హిమబిందు ఈ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగలక్ష్మి దాతలకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ బృందం, విద్యార్థినులు ఉన్నారు.

## డిజిటల్ క్లాసులతో విద్యార్థులకు నైపుణ్యం



**వింజమూరు, జూన్ 24, ప్రభాతవార్త :** విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక పరమైన విద్యను అందించేందుకు డిజిటల్ క్లాసులు దోహద పడతాయని వింజమూరులోని శ్రీ సుబ్రహ్మణ్య ఎడ్యుకేషన్ అకాడమీ డైరెక్టర్ బి సురేంద్ర రాజు తెలిపారు. బుధవారం తన సుబ్రహ్మణ్య ఎడ్యుకేషనల్ అకాడమీలో డిజిటల్ క్లాసులు ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో రోజురోజుకు పెరుగుతున్న సాంకేతిక మైన విద్యను అందించాలని ఉద్దేశంతో ఈ డిజిటల్ క్లాసులను ప్రారంభించామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న విద్యార్థులు సాంకేతిక మార్పులతో కూడిన నాణ్యమైన విద్యను పొందేందుకు దూరప్రాంతాలకు వెళ్లి చదివేందుకు సాధ్యం కానీ విద్యార్థులు తమ నైపుణ్యాన్ని సృజనాత్మకతను తనలోనే అనచివేసుకుంటున్నారని విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఉద్దేశంతో ఈ ప్రయత్నం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే మా సంస్థలో నవోదయ సైనిక ఎంసెట్ నీట్‌కు సంబంధించిన శిక్షణను ఇస్తున్నామని ఎంతో మంది విద్యార్థులను ఇంజనీర్లుగా తయారు చేసిన సంస్థగా పేరు పొందిందని తెలిపారు విద్యార్థుల భవిష్యత్తు లక్ష్యంగా సంస్థ నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు. సంవత్సరానికి సంస్థ అభివృద్ధి చెందుతూ విద్యార్థులతో కలకలలాడుతుందని ఇది ఎంతో గర్వంగా ఉందని తెలిపారు భవిష్యత్తులో విద్యార్థులకు బంగారు బాటను చూపుతూ వారికి ఉన్నత జీవితాన్ని అందించే విధంగా తమ సంస్థ ప్రణాళికను సిద్ధం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు ఉన్నారు.

## బీసీ వసతి గృహాలకు ప్రత్యేక వాటర్ ఫిల్టర్లు



**కోవూరు, జూన్24 ప్రభాతవార్త :** జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ బాలికల వసతి గృహ సముదాయానికి రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ ద్వారా ప్రతి వసతి గృహానికి ప్రత్యేకంగా ఆరు కుళాయిలు ఏర్పాటు చేసి ఉన్న వాటర్ పిల్టర్లను ఇటీవల పంపిణీ చేశారు. వసతి గృహంలో చదువుతున్న విద్యార్థినులకు సురక్షిత నీరు అందించాలనే ఉద్దేశంతో ప్రతి వసతి గృహంలో ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ తసుకుని ఈ వాటర్ ఫిల్టర్లు ఏర్పాటు చేయడం పట్ల వసతి గృహంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## పీఆర్ఎన్‌లో శుభదిన్ కాతిథి భోజన్



**కోవూరు, జూన్24 ప్రభాతవార్త :** కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బుధ వారం పాఠశాల పీఈటీ వెంకటసుబ్బమ్మ పాఠశాలలో చదువుతున్న 660 మంది విద్యార్థులకు శుభదిన్ కాతిథి భోజన్ కార్యక్రమంలో భాగంగా బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బమ్మను పాఠశాల ఇన్ చార్జి ప్రధానోపాధ్యాయిని పర్వీన్, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

## చేజర్లలో దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ



**చేజర్ల, జూన్ 24, ప్రభాతవార్త :** చేజర్ల మండలంలోని ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాల(మెయిన్) లోని భవితా కేంద్రంలో బుధవారం దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన సహాయక ఉపకరణాలను పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పని చేస్తున్న ఏఎల్ఐఎంసీఓ సంస్థ ద్వారా మండలానికి చెందిన 13 మంది దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–1 జి.ఇందిర విద్యార్థులకు ఉపకరణాలను అందజేశారు. ఇందులో 6 మంది విద్యార్థులకు ఎంఆర్ కిట్లు, 5 మందికి హియరింగ్ ఎయిడ్స్, ఒకరికి వీల్‌చైర్, మరొకరికి బ్యాటరీ సైకిల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఇందిర మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులు విద్యాభ్యాసంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వారికి అవసరమైన సహాయక పరికరాలు అందించడం ద్వారా విద్యలో మరింత ముందుకు సాగేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆర్.శ్రావణ్, పాఠశాల హెచ్‌ఎం టి.మోహన్, ఐఈడీఎస్ కోఆర్డినేటర్ భాషా, ఐఈఆర్పీలు మస్తాన్ వలి, సీహెచ్ సునీత, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలు అందడంతో వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## దగదర్తిలో చోరీ కలకలం

**– రూ.4లక్షల నగదు, బంగారం, వెండి అపహరణ**



**దగదర్తి, జూన్ 24, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన దగదర్తి మల్లయ్యమిట్ట ప్రాంతంలో మంగళవారం రాత్రి జరిగిన చోరీ స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనలో సుమారు రూ.4లక్షల నగదు, ఏడు సవర్ల బంగారు నగదు, 750 గ్రాముల వెండి వస్తువులు దొంగల పాలయ్యాయి. బాధితులు, పోలీసులు కథనం మేరకు.. షేక్ అలీమ్ ప్రధాన రహదారి పక్కన నివాసం ఉంటూ టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం తన భార్య, కుమారుడితో కలిసి సమీపంలోని వెలుపోడు గ్రామానికి వెళ్లారు. అనంతరం రాత్రి ఇంటి వద్ద నిద్రించే సమయంలో ఇంటి తలుపులకు తాళం వేయకుండా, బీరువా తాళాన్ని అక్కడే ఉంచి ఆరు బయట నిద్రించారు. బుధవారం ఉదయం భార్య, కుమారుడు ఇంటికి చేరుకుని బీరువాను పరిశీలించగా అందులో ఉన్న నగదు, బంగారు నగలు, వెండి వస్తువులు కనిపించకపోవడంతో చోరీ జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో బాధితులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సహాయంతో తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు దగదర్తి సీఐ రాజేశ్వరరావు, ఎస్సై మహేంద్ర తెలిపారు.

## టీఎన్‌సీ ఉన్నత పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు




**కోవూరు, జూన్24 ప్రభాతవార్త :** జిల్లా వ్యాప్తంగా ఉన్న పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన 26 ఉన్నత పాఠశాలల్లో విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సమగ్ర శిక్ష ప్రత్యేక దృష్టి సారించింది. పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన ఈ ఉన్నత పాఠశాలల్లో ఒక్కొక్క పాఠశాలలో 20 కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్ష నుంచి ఇదివరకే ఆదేశాలు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో ఎంపికైన అన్ని ఉన్నత పాఠశాలల్లో సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో సాంకేతికతను ఉపయోగించుకునే దిశగా ప్రభుత్వ పాఠశాలలు అడుగులు వేయనున్నాయి.

## మొహరంకు ముస్తాబైన పీర్ల కావిడి




**బిట్రగుంట జూన్ 24 ప్రభాతవార్త** మండల కేంద్రమైన బోగోలులో మొహరం సందర్భంగా పీర్ల చావిడిని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు ఈనెల 26వ తేదీన త్యాగానికి ప్రతీకైనా మొహరం పర్వదినాన్ని ముస్లిం సోదరులు అత్యంత పవిత్ర నిర్వహించుకోవడం తెలిసిందే.అందులో భాగంగా గత మూడు రోజుల నుండి పీర్ల చావిడి లోని పేర్లను గుర్రాలపై ఊరేగింపు నిర్వహిస్తున్నారు. అగ్నిగుండాలు ఏర్పాటు చేసి అత్యంత భక్తిశ్రద్ధలతో వాటిని తొక్కుతూ తమ మొక్కుబడులు తీర్చుకుంటున్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యల పై ఉద్యమానికి సిద్ధం..

### - కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ధర్నా



**నెల్లూరు, జూన్ 24, ప్రభాతవార్త –** కలెక్టరేట్ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అను బంధం) నెల్లూరు జిల్లా సమితి ఆ ధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బుధవారం నెల్లూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అ నంతరం డిఆర్ఓకి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి యామాల మధు మాట్లాడుతూ కార్మికులకు ఇళ్ల స్థలాలు, సంక్షేమ పథకాలు, గ్రాట్యుటీ అమలు, పిఆర్సి ఏర్పాటు, 30 శాతం మధ్యంతర భృతి, బకాయిల చెల్లింపు, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ఆయన కోరారు. అలాగే జిఓఎంఎస్ నెం.25 ప్రకారం మరణించిన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని, స్కూల్ స్వీపర్లు, పార్కు కూలీలకు కనీస వేతనాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్వీపింగ్ మిషన్ల వినియోగం వల్ల అధిక ఖర్చులు అవుతున్నప్పటికీ ఫలితం లేకపోవడంతో వాటి స్థానంలో స్థానికంగా కార్మికులను నియమించి పనులు చేయించాలని ఆయన సూచించారు. అలాగే ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, థర్డ్ పార్టీ కాంట్రాక్టింగ్ విధానాన్ని రద్దు చేయాలని, హైకోర్టు తీర్పు మేరకు ఒప్పంద కార్మికులను రెగ్యులర్ చేయాలని, డైలీ వేజ్ కార్మికులను ఆప్కస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల పై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే జూలై 7న రాష్ట్ర వ్యాప్తంగా చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ యూనియన్ రాష్ట్ర సమితి సభ్యులు మల్లి అంకయ్య, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నందిపోగు రమణయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌డి సిరాజ్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కె ముక్తియర్, మునిసిపల్ నాయకులు నాగరాజు, ఆదినారాయణ, గోపి, కె.ప్రభావతమ్మ, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అదానీ కృష్ణపట్నం పోర్ట్‌లో మెగా రక్తదాన శిబిరం



**ముత్తుకూరు, జూన్ 24, ప్రభాతవార్త** అదాని కృష్ణపట్నం పోర్ట్‌లో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఆదాని చైర్మన్ గౌతమ్ అదానీ జన్మదినం సందర్భంగా పోర్ట్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 200 మంది రక్తదానం చేశారు. అదానీ దినోత్సవంగా పోర్ట్‌లో సీఈఓ మొక్కలు నాటారు చైర్మన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జగదీష్ పటేల్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు అవసరమైన వారికి సేవ చేయడంలో నిబద్ధతను ఇనుమడింప చేస్తుందని అన్నారు. రక్తదాన శిబిరాన్ని నిర్వహించడంలో సహకరించినందుకు వ్యాపార సహచరులు, ఉద్యోగులు,ఇండియన్ రెడ్క్రాస్ సొసైటీ అందరికీ సిఇఒ కృతజ్ఞతలు తెలిపారు.

## రొట్టెల పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి

### - భక్తులకు 24/7 నిరంతర విద్యుత్ సరఫరా- ఎస్ఈ కె.రాఘవేంద్రం



**నెల్లూరు, జూన్ 24, ప్రభాతవార్త – వైద్యం** రొట్టెల పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని, భక్తులకు 24/7 నిరంతర విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసామని ఎస్ఈ రాఘవేంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యుత్ భవన్‌లో మాట్లాడుతూ దర్గా సేవలో 15 మంది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, 22 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, 150 మంది ఓఅండ్ ఎంసిబ్బంది దర్గాఆవరణలో విద్యుత్ శాఖ స్టాల్ (రిసెప్షన్ కౌంటర్) ఉంటుందన్నారు. భక్తులు విద్యుత్ పరంగా ఏ సమస్య ఉన్న తెలుపవచ్చన్నారు. బారాషాహిద్ దర్గా నందు ఈ నెల 26వ తేదీ నుండి 30వ తేదీ వరకు రొట్టెల పండుగ జరుగుతుందని, అందువల్ల రొట్టెల పండుగకు విచ్చేయుచున్న భక్తులకు నిరంతర మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు రూరల్ ఎంఎల్ఏ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సూచనలు మేరకు దర్గాలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరాకు నాలుగు 315 కెవిఏ ట్రాన్స్ఫార్మర్స్, ఒక 250 కేవీఏ ట్రాన్స్ఫార్మర్స్, అయిదు 160 కేవీఏ ట్రాన్స్ఫార్మర్స్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. 125 కెవిఏ డిపార్ట్మెంటల్ జనరేటర్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాదాపు 2500 కెవిఏ సామర్థ్యంతో నిరంతర విద్యుత్‌కు అన్ని చర్యలు తీసుకున్నామని ఎస్ఈ తెలిపారు. గత 10 రోజుల నుంచి ఐఈ సెక్షన్ సిబ్బంది దర్గాలో పనులు పూర్తి చేశారని తెలిపారు. అలాగే షాపులు పెట్టుకునే వాళ్లు ఖచ్చితంగా ఎర్తింగ్ చేసుకోవాలని తెలిపారు. ప్రతి షాప్ ఎర్తింగ్ చేసుకున్నారా లేదా అని షాప్ షాప్ పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ ఐదు రోజులు మా సిబ్బందికి మూడు షిఫ్ట్‌లతో డ్యూటీలు వేసామని తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 వరకు ఒక షిఫ్ట్, సాయంత్రం 5 నుంచి రాత్రి 10 వరకు ఒక షిఫ్ట్, రాత్రి 10 నుండి మరుసటి రోజు ఉదయం 8 వరకు ఒక షిఫ్ట్ మూడు షిఫ్ట్‌గా డ్యూటీలు వేసావని ఒక్కొక్క షిఫ్ట్‌లో ఒక డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఒక అసిస్టెంట్ ఇంజనీరు, నలుగురు విద్యుత్ సిబ్బంది ఉంటారని అలాగే రాత్రి కూడా అదే విధంగా ఉంటారని, సాయంత్రం పీక్ లోడ్ అందరూ లైటింగ్ ఉపయోగిస్తారు అందువల్ల ఆ పీక్ లోడ్ లో అదనంగా ఒకడిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఇద్దరు అసిస్టెంట్ ఇంజనీర్స్, ఎనిమిది మంది సిబ్బంది పెట్టామని, మా విద్యుత్ స్టాల్ నందు రిసెప్షన్ కౌంటర్ ఓపెన్ చేస్తున్నామని అక్కడ ఒక అసిస్టెంట్ ఇంజనీర్, ఒక జూనియర్ ఇంజనీరు ఇద్దరు స్టాఫ్ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ రొట్టెల పండుగ సందర్భంగా నేను కోరుకు నేది విద్యుత్ సంస్థ ఆర్థిక పురోగతి సాధించాలని, సంస్థ ఉద్యోగులు సుఖ సంతోషాలతో మంచి ఆరోగ్యంలో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలియచేసారు. ఈ 5రోజులు ఐఈ సెక్షన్ సిబ్బంది అంత దర్గా ప్రాం గణంలోనే ఉండాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా విద్యుత్ సరఫరాలో ఎటువంటి చిన్న అంతరాయం కూడా కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే ఈ అయిదు రోజులు మొత్తం దర్గా కార్యక్రమాలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టౌన్ శ్రీధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్ పర్యవేక్షణ చేస్తుంటారని తెలిపారు.

## నాలుగో అంతస్తు నుంచి పడి యువకుడు మృతి



**కోవూరు, జూన్ 24, ప్రభాతవార్త** కోవూరు మండలం ఇనమడుగు గ్రామానికి చెందిన మావిళ్ల నరేష్ (37) కోవూరులో నాలుగు అంతస్తుల భవనంలో లైటింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ కాలుజారి కిందపడిపోయాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ నరేష్ మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ప్రశాంతంగా రాపూరు మండల సర్వసభ్య సమావేశం



**రాపూరు, జూన్24ప్రభాతవార్త** రాపూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం బుదవారం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. యంపీపీ కుమ్మరిగుంట ప్రసన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు ప్రజా ప్రతనిధులు, వివిధ శాఖల అధికారులు హాజరై మండల అభివృద్ధి, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. పలువురు సభ్యులు గ్రామాల్లో వున్న సమస్యలను సభ దృష్టికి తీసుకోని వచ్చారు. ఈసందర్భంగా యంపీడీఓ పి. వసుందరమ్మ మాట్లాడుతూ మండల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సభ దృష్టికి తీసుకోని వచ్చిన అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు చిగురుపాటి ప్రసన్న, మండల విద్యాశాఖాధికారి గుండవోలు శ్రీనివాసులు, జిలానీ, పలు శాఖల అధికారులు, పలువురు యంపీటీసిలు తదితరులున్నారు.

## ఎన్వీ కండ్రికలో వివాహ వేడుకలో పాల్గొన్న మేకపాటి



**చేజర్ల, జూన్ 24, ప్రభాతవార్త** చేజర్ల మండలం ఎన్వీ కండ్రిక గ్రామంలో బుధవారం జరిగిన వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు తేళ్ల శేఖర్‌రెడ్డి సోదరుడు తేళ్ల కొండారెడ్డి,ఇందిరమ్మ దంపతుల కుమారుడు తేళ్ల మనోహర్‌రెడ్డి వివాహ కార్యక్రమంలో పాల్గొన్న మేకపాటి విక్రమ్ రెడ్డి నూతన వధూవ రులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వారిదాంపత్య జీవితం ఆనందంగా, సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధువులు మాజీ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఉగ్గుమూడి రఘురామిరెడ్డి, కాలేషా, తేళ్లశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కావలి వన్‌టౌన్ సిఐగా రంగనాథ్‌గౌడ్ బాధ్యతలు స్వీకరణ



**కావలి, జూన్ 24 ప్రభాతవార్త :** కావలి ఒకటవ పట్టణ సిఐగా వై.రంగనాథ్‌గౌడ్ బుధవారం బాధ్యతలు స్వీకరించడం జరిగింది. ఈయన గుంటూరు రేంజ్ విఆర్‌న ఉంచి కావలికి రావడం జరిగింది. ఇక్కడ పని చేస్తు న్న సిఐ ఫిరోజ్ గుంటూరు రేంజ్ విఆర్‌కు బదిలీ అయ్యారు. ఈ సం దర్భంగా నూతన సిఐ మాట్లాడుతూ వన్‌టౌన్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్ర తల పరిరక్షణకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ఎలాంటి నేరాలకు తావివ్వ కుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## వైభవంగా ఆత్మారాముని ధ్వజారోహణం



**నంగం జూన్ 24 ప్రభాతవార్త** సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలోని శ్రీ ఆత్మారామస్వామి వారి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభం అయ్యాయి. అర్చకులు వేదగిరి సత్యనా రాయణాచార్యులు, రాజ్ కుమార్‌స్వామి, భరత్‌స్వామి ధ్వజారోహణం వద్ద పూజా కార్యాక్రమాలు నిర్వ హించారు. ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తు ధ్వజపతం ఎగురవేశారు. ధ్వజారోహణం అనంతరం సంతానం లేని వారి కొడిముద్దను ప్రసాదంగా అందజేశారు. ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా దొడ్ల పద్మనాభరెడ్డి కుటుంబం వ్యవహరించారు. ఈకార్యాక్రమంలో బుచ్చిరెడ్డిపాళెంకి చెందిన దొడ్ల కోదండరామిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ ఇఒ చిల్లకూరు వరప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.కార్యక్రమంలో దువ్వూరు సొసైటీ చైర్మన్ బండా హరికిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు సర్వేను సమగ్రంగా చేపట్టండి



**గూడూరు, జూన్ 24, ప్రభాతవార్త** పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఓటర్ వెరిఫికేషన్, డోర్‌టు డోర్ కార్యక్రమం పై నియోజకవర్గంలోని టిడిపి నాయకులు అనుబంధ సంఘసభ్యులతో ఎమ్మెల్యే పాశింసునీల్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమంపై అనుబంధ సంఘ సభ్యులతో ఎమ్మెల్యే పాశింసునీల్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం పై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ బిఎల్ఓస్‌తో టిడిపి బూత్ లెవెల్ ఇన్చార్జిలు కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ఓటును వెరిఫికేషన్ చేయాలని ఎక్కడైనా దొంగ బోట్లు ఉంటే వాటిని తొలగించాలని సూచించారు. ఇప్పుడు కష్టపడి పనిచేసిన వారికే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ ఎంపీటీసీ జడ్పిటిసిలుగా అవకాశం ఇవ్వడం జరుగుతుందని అలాగే వచ్చే నెల నుండి డోర్ టు డోర్ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమవుతుందని ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చేసిన అభివృద్ధిని ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని కోరారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగడం లేదని ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని వాటిని గట్టిగా తిప్పికొట్టాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు కిరణ్ కుమార్, బిల్లు చెంచురామయ్య, ఇజ్రాయిల్, చంద్రమౌళి, శ్రీనివాసులు, రహీం, శివకుమార్, హరికుమార్, రాజశేఖర్, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం



**గూడూరు, జూన్ 24, ప్రభాతవార్త** గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో పలు రాజకీయ పార్టీ నాయకులతో గూడూరు ఆర్డీవో అరుణకుమారి సర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిఎల్‌వోలు ఇంటింటి వెళ్ళి ఓటరు సర్వే చేస్తున్నారని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల నుండి బిఎల్ఏలను నియమించి బిఎల్‌వోలతో కలిసి ఇంటింటికి ఓటరు సర్వేను చేపట్టాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం పలు సూచనలు, సలహాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.వి.ప్రసాద్, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి

### - దేవస్థాన చైర్మన్ శ్రీ కంటి రామ్మోహన్ రావు



**గూడూరు, జూన్ 24, ప్రభాతవార్త** గూడూరు పట్టణం రాజావీధిలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం బుధవారం సా యంత్రం ఏడు గంటలకు అంకరార్పణతో మొ దలై, జూలై 4వ తేది శనివారం ఉదయం లక్ష తులసి పూజ మధ్యాహ్నం భారీ అన్నదానం, సాయంత్రం ఏకాంత సేవతో అత్యంత వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించబడునని ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని ఆలయ చైర్మన్ కంటి రామ్మోహన్ రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బ్రహ్మోత్సవాలకు గూడూరు నియోజకవర్గ శాసన సభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ పూర్తి సహాయ సహకారాలుతో, దేవస్థానం ధర్మకర్త మండలి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరుగుతాయన్నారు. గూడూరు పట్టణ, పరిసర ప్రాంత భక్తులు అందరూ కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనానికి వచ్చి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త మండలి సభ్యులు పేపళ్ల అమరయ్య నాయుడు, కొమ్మా రవీంద్రబాబు, ఉప్పు సాయి కృష్ణ, ఓబిలి బాబు, ముని కోటేశ్వర్ రెడ్డి, బుల్లయ్య,పాల్గొన్నారు.

## దుగరాజపట్నం పోర్టు షిప్ బిల్డింగ్ క్లస్టర్‌కు మాస్టర్ ప్లాన్

### డీపీఆర్ తయారీకి ప్రభుత్వం నిర్ణయం

**కోట, జూన్ 24 ప్రభాతవార్త** దుగరాజపట్నం పోర్టు, షిప్ బిల్డింగ్, షిప్ మరమ్మతుల క్లస్టర్ అభివృద్ధికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. షిప్‌యార్డు లేఅవుట్ సహా పోర్టు, షిప్ బిల్డింగ్ క్లస్టర్ ఏర్పాటుకు మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేయనుంది. పోర్టు, షిప్ బిల్డింగ్ క్లస్టర్ అభివృద్ధికి వీలుగా మౌలిక సదుపాయాల కోసం చేపట్టాల్సిన పనులకూ అంచనాలు రూపొందించనుంది. 15 నెలల్లో డీపీఆర్ సిద్ధం చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఏపీ మారిటైం బోర్డు (ఏపీఎంబీ) విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) భాగస్వాములుగా షిప్ బిల్డింగ్ క్లస్టర్ అభివృద్ధి చేసేలా ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. దీనికోసం నేషనల్ షిప్ బిల్డింగ్ అండ్ హెవీ ఇండస్ట్రీస్ పార్క్, ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఎన్‌షిప్ ఏపీ లిమిటెడ్) పేరిట జాయింట్ వెంచర్ కంపెనీని ఇప్పటికే ఏర్పాటు చేశాయి.

**మాస్టర్ ప్లాన్‌పై భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు** షిప్‌యార్డు, అనుబంధ పరిశ్రమల కోసం అన్ని భాగస్వామ్య సంస్థలు, రోడ్డు రవాణా ఆపరేటర్లు, రైల్వేలు, షిప్పింగ్ లైన్లు, క్లియరింగ్ అండ్ ఫార్వార్డింగ్ ఏజెంట్లు, తనిఖీ, ధ్రువీకరణ ఏజెంట్లు కస్టమ్స్, ఎక్సైజ్ అధికారులో సంప్రదింపుల తర్వాతే మాస్టర్ ప్లాన్ తయారు చేయనున్నారు. ప్రాజెక్టు వ్యయం, బ్రేక్ వాటర్స్ వంటి మౌలిక సదుపాయాల కోసం అయ్యే ఖర్చులు, పోర్టు, షిప్ బిల్డింగ్ అభివృద్ధికి అయ్యే ఖర్చులను విడివిడిగా పరిశీలించనున్నారు.

**కీలక నిర్మాణాలపై స్పష్టత** డీపీఆర్ తయారీకి టెక్నికల్ కన్సల్టెంట్‌ను నియమించడానికి ప్రభుత్వం ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన జారీ చేసింది. ఎంపికైన సంస్థ గతంలో చేసిన అధ్యయనాలు, ప్రణాళికలతో పాటు డేటా కలెక్షన్, కార్గోట్రాఫిక్, వెసల్ సైజ్, ల్యాండ్ ఇన్వెస్టిగేషన్, ప్రాథమిక ఇంజినీరింగ్ సర్వేలు పరిశీలించి మాస్టర్ ప్లాన్ తయారు చేయనుంది.

## మాదక ద్రవ్యాలను సమూలంగా నిర్మూలిస్తాం : ఎస్ఐ శివసౌమ్య



**కోట,జూన్ 24 ప్రభాతవార్త** సమాజంలో మాదక ద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వశాఖలు, విద్యాసంస్థలు,స్వచ్ఛందసంస్థలు, సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని దుగ్గరాజపట్నంమెరైన్ ఎస్ఐ.శివసౌమ్య పేర్కొన్నారు.బుధ వారం మండల పరిధిలోని విద్యానగర్‌లోని శ్రీనివాస్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వలన కలిగే నష్టాలను గురించి ఆమె వివరించారు. మాదక ద్రవ్యాల వ్యసనం యువత ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్రప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు. మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు, భాగస్వామ్యం కావలన్నారు. యువత, ప్రజలు మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేసి మాదక ద్రవ్య రహిత నెల్లూరు జిల్లాగా తమ వంతు సహకారం అందించాలని శివసౌమ్య పిలుపునిచ్చారు. విద్యార్థుల చిన్న తనం నుంచి క్రమశిక్షణతో చదవుకోవాలని మెరైన్ ఎస్.ఐ శివ సౌమ్యకోరారు. సముద్ర స్నానాలకు వెళ్లిన సమయంలో అనుకోకుండా ప్రమాదాలు జరిగినప్పుడు ఏలా రక్షించుకోవాలని అనే విషయాలపై వివరించారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బెల్లంకొండ శ్రీనివాసులు,ప్రిన్సిపల్ వెంకన్న,తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా సర్ కార్యక్రమం పూర్తి కావాలి



**కోవూరు, జూన్24 ప్రభాతవార్త** మండలం పడుగుపాడు గ్రామంలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని బుధవారం తహసీల్దార్ సుబ్బయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి బీఎల్‌వోలు చేపడుతున్న సర్ కార్యక్రమాన్ని పరి శీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలోని ప్రతి ఓటరు బీఎల్‌వోలకు సహకరించాలని ఈ సందర్భంగా తెలిపారు. అదేవిధంగా బీఎల్‌వోలు ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే సూపర్‌వైజర్లకు, కార్యాలయ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనాథ్, బీఎల్‌వోలు ఉన్నారు.

## ర్యాంకు ఎంత వస్తుందో ..?

## ఈఏపీసెట్ ఫలితాల కోసం ఎదురు చూపులు



**కోట,జూన్ 24 ప్రభాతవార్త** త్వరలో ఇంజినీరింగ్,అగ్రికల్చరల్,ఫార్మసీ కళాశాలలో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షల ఫలితాలు రాను న్నాయి. వీటి కోసం విద్యార్థులతో పాటు వారి తల్లి దండ్రులు ఎదురు చూస్తున్నారు. ర్యాంకు ఎంత వస్తుంది? పేరొందిన కళాశాలలో నచ్చిన బ్రాంచిలో సీటు వస్తుందా .. లేదా అనే ఆందోళనలో వీరు ఉన్నారు.జిల్లాలో 10 ఇంజినీరింగ్ కళాశాలలు ఉండగా ఇక్కడ 12 వేల పైగా సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో ఏ బ్రాంచిలున్నాయి…గత ఏడాది ఎంత ర్యాంకు వస్తే సీటు వచ్చింది.. ఫీజుల వివరాలు తెలుసుకునే పనిలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు. ఈ ఏడాది ఎంత ర్యాంకు వస్తే ఆ కళాశాలలో సీటు తమ పిల్లలుకు వస్తుందో అనే అలోచనలో ఉన్నారు. కొందరైతే ర్యాంకులతో సంబంధం లేకుండా పిల్లవాడి ఆ సక్తిని బట్టి బ్రాంచిల్లో యాజమాన్య కోటాలో సీటుకు ముందుస్తుగా అడ్వాన్సులు చెల్లించే పనిలో ఉన్నారు. మరి కొందరు ర్యాంకులు వచ్చే వరు వేచి ఉండాలనే నిర్ణయంతో ఉన్నారు. నిపుణులు మాత్రం కళాశాలల్లో మౌలిక వసతులను దృష్టిలో పెట్టుకుని కళాశాలను ఎంపిక చేసుకోవడం మంచిదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు కోర్ బ్రాంచీలు తీసుకున్నా మంచి భవిష్యత్తు ఉంటుందని తరగతుల్లో నేర్చుకున్న దానితో పాటు సాంకేతికంగా వస్తున్న మార్పులుపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని సూచిస్తున్నారు. ఈఏడాది మే 12 నుంచి 23 వరకు జరిగిన ఈఏపీసెట్ జిల్లాలో 20 వేల పైగా రాశారు. ఇప్పటికీ చాల మంది విద్యార్థులు ఈఏపీసెట్‌లో మార్కులు ఎన్ని వస్తాయోకీ ఆధారంగా ఒక అంచనాకు వచ్చారు.ఇంటర్ మార్కుల్ 25 శాతం వెయిటేజీ ఉంది. ఇంకా ఫీజులను సాంకేతిక విద్యాశాఖ స్పష్టం చేయలేదు.

## పడుగుపాడులో వీపీఆర్ నేత్ర శిబిరం విజయవంతం



**కోవూరు, జూన్24 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా వీపీఆర్ నేత్ర కార్యక్రమం బుధవారం కూడా కొనసాగింది. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు ప్రత్యేక చొరవ తీసుకన్నారు. ఇప్పటికే కోవూరు మండలంలోని మోడేగుంట, వేగూరు గ్రామాల్లో వీపీఆర్ నేత్ర శిబిరం పూర్తి చేసుకుని పడుగుపాడులో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుబ్బయ్య మాట్లాడుతూ ఈ శిబిరం పేదలకు ఎంతో ఉపయోగకరం అన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో కంటి పరీక్షలు, ఆపరేషన్లు, అద్దాలు ఏర్పాటు చేసుకోవాలంటే వేలాది రూపాయలు వ్యయం చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుతం ఈ శిబిరంలో ఎటువంటి ఖర్చు లేకుండా ఉచితంగా అందిస్తున్నారని, ఇందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ శిబిరంలో టీడీపీ నాయకులు జెట్టి మదన్‌రెడ్డి, సీహెచ్ పెంచలయ్య, రమేష్ యాదవ్, శ్రీనివాసులు నాయుడు, ఫిరోజ్ ఖాన్, తదితరులు ఉన్నారు.

## గంగమిట్ట అంగన్వాడీ కేంద్రాన్ని సీడీపీవో ఆకస్మిక తనిఖీ

### - కార్యకర్త దురుసు ప్రవర్తన పై విచారణ





**వింజమూరు, జూన్ 24, ప్రభాతవార్త:**వింజమూరు పంచాయతీ పరిధిలోని గంగమిట్ట అంగన్వాడీ కేంద్రాన్ని బుధవారం ఐసీడీఎస్ సీడీపీవో పద్మజాకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని రికార్డులు, స్టాక్, లబ్ధిదారుల హాజరును క్షుణ్ణంగా పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలుఅడిగితెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర కార్యకర్త గత శనివారం అంగన్వాడీకి రాకుండా బీసీ కాలనీలోనిప్రాథమికపాఠశాలకు వెళ్లి పాఠశాలలో వాటర్ ప్లాంట్ మరమ్మతుకు గురైన విషయంలో బయట వాటర్ ప్లాంట్ వద్ద నీళ్లు తెచ్చుకునే విషయమై ఉపాధ్యాయులతో కార్యకర్తదురుసుగాప్రవర్తించా రాని దీనిపై ఉపాధ్యాయులు ఫిర్యాదు చేయడంతో ఈ నేపథ్యంలోజిల్లాఉన్నతాధికారులు విచారణకు ఆదేశించడంతో ఈ తనిఖీ చేపట్టినట్లు తెలిపారు.

**– తనిఖీలో వెలుగులోకి వచ్చిన లోపాలు:** కేంద్ర పరిధిలో 10 మంది గర్భిణులు, 2 మంది బాలింతలు, 29 మంది టేక్ హోం రేషన్ లబ్ధిదారులు, 19 మంది ప్రీస్కూల్ పిల్లలు నమోదై ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. కానీ విచారణ సమయంలో ప్రీస్కూల్ తల్లిదండ్రులు ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. కేంద్రానికి కొద్ది దూరంలో ఒక దిమ్మ చాటున 6 బాక్సుల్లో పాల ప్యాకెట్లు, 130 కోడిగుడ్లు దాచిపెట్టి ఉండడాన్ని సీడీపీవో గుర్తించారు. లబ్ధిదారులు స్టాక్ తీసుకెళ్లడం లేదని, అందుకే అదనంగా ఉందని కార్యకర్త చెప్పారు. కేంద్రంలో ఉండాల్సిన స్టాక్‌ను బయట దిమ్మ చాటున ఎందుకు ఉంచారని సీడీపీవో ప్రశ్నించారు. వెంటనే స్టాక్‌ను కేంద్రంలోకి తరలించారు. అలాగే కేంద్రం సమీపంలోని బాత్రూం వద్ద ప్రభుత్వం అందించిన మెడికల్ కిట్ ఉంది. అది తన కేంద్రానికి చెందినది కాదని, సాతనవారిపాలెం కేంద్రానికి సంబంధించినదని కార్యకర్త చెప్పారు. అయితే ఈ కేంద్రానికి ఇచ్చిన మెడికల్ కిట్ ఏదని అడగగా సరైన సమాధానం ఇవ్వలేదు. విచారణ సమయంలో ప్రీస్కూల్ తల్లిదండ్రులు హాజరయ్యారు. రిజిస్టర్‌లో పేర్లు నమోదు కాకపోవడంతో వారిని పిలిచి అడిగారు. ఆత్మకూరు నుంచి వచ్చామని, సరుకులు సక్రమంగా ఇస్తున్నారని, పేర్లు ఇంకా నమోదు కాలేదని వారు తెలిపారు. విచారణ సమయంలో బయట ఉండాలని ప్రీస్కూల్ తల్లిదండ్రులకు సీడీపీవో సూచించారు. కేంద్ర కార్యకర్త సక్రమంగా రికార్డులు నిర్వహించకపోవడం, సమయపాలన పాటించకపోవడం, లబ్ధిదారులకు సరైన సేవలు అందించకపోవడం వంటి అంశాలపై మెమో జారీ చేస్తున్నట్లు సీడీపీవో పద్మజా కుమారి తెలిపారు. గురువారం పూర్తిస్థాయిలో విచారణ చేసి, లబ్ధిదారులందరినీ పిలిచి వివరాలు సేకరించిన అనంతరం జిల్లా ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సీడీపీవో శర్మిష్టా, సూపర్వైజర్ నాగేశ్వరి మరియు సిబ్బంది సుధాకర్ అంగన్వాడీ కార్యకర్త ఆయమ్మ తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ జిల్లా సమాచార సేకరణ కమిటీలలో ఉదయగిరి జనసేన పార్టీ నాయకులకు అవకాశం



ఉదయగిరి, జూన్ 24, ప్రభాతవార్త జనసేన పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడంతో పాటు, జనసైనికుల నుంచే భవిష్యత్ నాయకత్వాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీలలో నెల్లూరు జిల్లా కమిటీలో ఆల్లూరి రవీంద్రకు సభ్యునిగా అవకాశం లభించింది. ఈ సందర్భంగా ఆల్లూరిరవీంద్ర మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్, పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, ఉదయగిరి నియోజకవర్గ పీఓసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొట్టే వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను అంకితభావంతో నిబద్ధతతో నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## మన్నవ రవిచంద్ర స్వగృహానికి ఎంపీ బీఎంఆర్



**కావలి, జూన్ 24, ప్రభాతవార్త:** టిడిపి సీనియర్ నాయకులు మన్నవ రవిచంద్ర స్వగృహానికి బుధవారం రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు యాదవ్ రావడం జరిగింది. ఈ సందర్భంగా బీద మస్తాన్ రావు ను మన్నవ రవిచంద్ర దుశ్శాలవాలతో ఘనంగా సత్కరించి తేనేటి విందును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు టిడిపి ముఖ్య నేతలు మన్నవ నివాసానికి చేరుకుని బీద మస్తాన్ రావుని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. వారి వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ నగళ్ళ శ్రీనివాస్ కిరణ్, పెన్నా డెల్టా ఉపాధ్యక్షులు బీద గిరిధర్, టిడిపి సీనియర్ నాయకులు బొట్లగుంట శ్రీహరి నాయుడు, మంచాలు ప్రసాద్, జనిగర్ల మనోహర్ యాదవ్, గాదంశెట్టి వేణుగోపాల్, కుందుర్తి కిరణ్ కుమార్, వల్లూరు మహేష్ నాయుడు, పులివర్తి రాజశేఖర్ వల్లూరు చెన్న కేశవులు, తదితర టిడిపి నేతలు పాల్గొన్నారు.

## నాగర్పమ్మ ప్రతిష్ఠ విగ్రహాల గ్రామోత్సవం



**ఉదయగిరి, జూన్ 24, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరిలోని గొల్లపాలెంలో శివాలయం వీధిలో గల కొత్తగా నాగర్పమ్మ దేవాలయంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠ మహో త్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. కార్యక్రమాలలో భాగంగా బుధవారం ప్రతిష్ఠ ఇచ్చిన విగ్రహాలను ప్రత్యేక వాహనంలో అలంకరించి ఉదయగిరి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. మహిళ భక్తులు అమ్మవారికి వారు కడవ పోసి కాయ కర్పూరాలు నైవేద్యం సమర్పించి పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. గురువారం విగ్రహాల ప్రతిష్ఠ జరుగుతుందని, కావున భక్తులందరూ ఈ కార్యక్రమానికి విచ్చేసి తిలకించాల్సిందిగా గ్రామ కమిటీ తెలిపారు.